నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శుక్రవారం 24-4-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 233 | పేజీలు: 4 | వెల: రూ.1/-

సిల్లీ కారణాలతో రోడ్లపైకి రాకండి

-ఇంట్లో ఉంటేనే కరోనా కట్టడి: సజ్జన్నార్

హైదరాబాద్,ఏప్రిల్23(ఆర్ఎన్ఎ): ఏదో ఓ కారణంతో రోడ్లపైకి వచ్చే బదులు ఇంట్లోనే ఉండి కరోనా కట్టడికి సహకరించవచ్చని సైబరాబాద్ సీపీ సజ్జనార్ అన్నారు. ప్రజలు లాక్‌డౌన్ పాటించడమే కరోనా నివారణకు పెద్ద సహకరమన్నారు. రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని అత్తాపూర్‌లో సైబరాబాద్ సీపీ సజ్జనార్ పర్యటించారు. రోడ్లపై తిరుగుతున్న వాహనాలను సీపీ తనిఖీ చేశారు. లాక్‌డౌన్ నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీపీ సజ్జనార్ మీడియాతో మాట్లాడారు. అనుమతి లేకుండా, కారణం లేకుండా రోడ్లపైకి వచ్చే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని సజ్జనార్ హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఇంట్లోనే ఉండి ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నిత్యావసర సరుకులు, వస్తువుల కోసం రోడ్లపైకి వచ్చే వారు తప్పనిసరిగా హెల్మెట్, లైసెన్స్, ఆధార్ కార్డు కూడా తీసుకురావాలని సూచించారు. ని త్యావసర సరుకుల కోసం వచ్చే వారికి 3 కిలోమీటర్ల లోపు మాత్రమే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. పోలీసులు ఎక్కడ తనిఖీలు చేసినా ప్రజలు సహకరించాలని సీపీ సజ్జనార్ కోరారు.

రిపబ్లిక్ టీవీ చీఫ్ అర్నాబ్ గోస్వామి దంపతులపై దాడి

కారుపై దాడిచేసిన యువజన కాంగ్రెస్ కార్యకర్తలు కేసు నమోదు చేసి అరెస్ట్ చేసామన్న పోలీసులు

ముంబై,ఏప్రిల్23(ఆర్ఎన్ఎ): రిపబ్లిక్ టీవీ ఎడిటర్ ఇన్ చీఫ్ అర్నాబ్ గోస్వామి దంపతులపై ఇద్దరు గుర్తు తెలియని దుండగులు దాడికి పాల్పడ్డారు. తెల్లవారుజామున ముంబైలోని స్టూడియో నుంచి విధులు ముగించుకుని ఇంటికి వెళుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. అయితే దాడిలో గోస్వామి దంపతులకు గాయాలు కాలేదు. అర్నాబ్ గోస్వామి, సమియా గోస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గోస్వామి బుధవారం ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియాలో విశ్వసనీయత లోపించిందని ఆరోపిస్తూ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. మహారాష్ట్రలోని పాల్‌ఘార్‌లో ఇద్దరు సాధువులు, ఓ డ్రైవర్‌పై మూకదాడి ఘటనపై టీవీ లైవ్ చర్చలో అర్నబ్ తన రాజీనామాను ప్రకటించారు. ఈ కేసులో ఇద్దరు వ్యక్తులు అరెస్టు చేసినట్లు ముంబై జోన్ 3 డీసీపీ ప్రకటించారు.

దాడిని ఖండించిన కేంద్ర మంత్రి

రిపబ్లిక్ టీవీ చీఫ్ ఎడిటర్ అర్నాబ్ గోస్వామి, అతని భార్య సమయబ్రతరాయ్‌లపై జరిగిన దాడి కేసులో ఇద్దరు నిందితులను ముంబై పోలీసులు గురువారం ఉదయం అరెస్టు చేశారు. ఇద్దరు నిందితులపై ఐపీసీ సెక్షన్ 341, 504 కింద కేసు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేశామని ముంబై డీసీపీ అవినాష్ కుమార్ చెప్పారు. ముంబై వర్లీలోని రిపబ్లిక్ టీవీ కార్యాలయం నుంచి కారులో ఇంటికి వెళుతుండగా ఇద్దరు యువజన కాంగ్రెస్ కార్యకర్తలు తనపై దాడిచేశారని అర్నాబ్ చేసిన ఫిర్యాదు మేర కేసు నమోదు చేశారు. రిపబ్లిక్ టీవీ చీఫ్ ఎడిటర్ అర్నాబ్ గోస్వామిపై దుండగులు చేసిన దాడి ఘటనను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి ప్రకాష్ జవడేకర్ ఖండించారు. అర్నాబ్ పై దాడి ఘటన ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా జరిగిన దాడిగా మంత్రి అభివర్ణించారు. అర్నాబ్ పై దాడి ఘటనపై తాము కఠినచర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు.

ఛత్తీస్‌ఘడ్‌లో కేసు నమోదు

రిపబ్లిక్ టీవీ చీఫ్ ఎడిటర్ అర్నాబ్ గోస్వామిపై ఛత్తీస్‌ఘడ్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. అర్నాబ్ గోస్వామి రెచ్చగొట్టేలా చేసిన వ్యాఖ్యలపై ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి టీఎస్ సింగ్ డియో, ఆ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోహన్ మార్కమ్ లు రాయపూర్ లోని సివిల్ లైన్స్ పోలీసులకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు.

దీంతో రాయపూర్ పోలీసులు కాంగ్రెస్ నేతల ఫిర్యాదుపై ఐపీసీ సెక్షన్ 153 ఎ (), 295 ఎ , 502 (2) ల కింద కేసు నమోదు చేశారు.

అర్నాబ్ గోస్వామి విద్వేషపూరిత పుకార్లను ప్రచారం చేశారని, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీని కించపర్చారని, ఈ కేసులో అర్నాబ్ ను అరెస్టు చేయాలని కాంగ్రెస్ నేతలు కోరారు. అర్నాబ్ గోస్వామి ద్వేషపూరితంగా పుకార్లను జర్నలిజం పేరిట వ్యాప్తి చేస్తున్నారని కాంగ్రెస్ మీడియా సెల్ ఛైర్మన్ నితిన్ త్రివేది ఆరోపించారు. రెచ్చగొట్టేలా విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసిన అర్నాబ్ ను అరెస్టు చేయాలని ఛత్తీస్‌ఘడ్ కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు.

వ్యాక్సిన్ కోసం ముమ్మర పరిశోధనలు

కట్టుదిట్టంగా లాక్‌డౌన్ అమలు ఎక్కడికక్కడ బ్యారికేడ్లతో దారులు మూసివేత

కఠిన చర్యలు తప్పవని మరోమారు హెచ్చరిక

హైదరాబాద్,ఏప్రిల్23(ఆర్ఎన్ఎ): అన్నట్లుగానే జంటనగరాల్లో లాక్‌డౌన్ కఠినంగా అమలు చేస్తున్నారు. వేకు జామునుంచే పోలీసులు కట్టడికి దిగుతున్నారు. ఎక్కడికక్కడ బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. తాజాగా గురువారం ఆయా కాలనీల నుంచి బయటకు రాకుండా బ్యారికేడ్లు పెట్టారు. వీధి మొదలు నుంచి ఎండ్ వరకు బ్యారికేడ్లు పెట్టారు. జనాలను బయటకు రాకుండా గత మూడురోజులుగా చర్యలు తీసుకుంటు న్నారు. కరోనా మహమ్మారి విజృంభిస్తున్నా నగరవాసులు కొందరు దాన్ని సీరియస్‌గా తీసుకోకుండా రోడ్లపై తిరగడంపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అగ్రరాజ్యం అమెరికా సైతం కరోనా బారినపడి చిగురుటాకులా వణికిపోతోందని, అది మనందరికీ ఒక పాఠం కావాలని ఆయన సూచించారు. దీనికి ఆయన ఒక ఆడియో సందేశం విడుదల చేశారు. అమెరికాలో కరోనా మరణాల సంఖ్య వియత్నాం యుద్ధంలో మరణాల కంటే ఎక్కువని ఆ సందేశంలో పేర్కొన్నారు. హైదరాబాద్ నగరవాసులు కంటైన్మెంట్ ఏరియాలను పూర్తిస్థాయిలో సీల్ వేసినట్లు భావించాలని, లాక్‌డౌన్‌ను ప్రతి ఒక్కరూ సీరియస్‌గా తీసుకోవాలని సీపీ అంజనీకుమార్ కోరారు. ఇప్పటికీ నగరంలో రోజుకు ఆరు నుంచి ఏడు వందల వాహనాలు సీజ్ చేస్తున్నమని, లాక్‌డౌన్ పూర్తిస్థాయిలో పాటించడంలేదు అని చెప్పడానికి ఇదే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, అందరం కలిసికట్టుగా కరోనాపై యుద్ధంలో విజయం సాదిద్దామని సీపీ అంజనీ కుమార్ పిలుపునిచ్చారు.

అద్దె వేధింపులపై హెచ్చర్కిలో ఫిర్యాదు

హైదరాబాద్,ఏప్రిల్23(ఆర్ఎన్ఎ): నగరంలో ఓ హాస్టల్‌లో ఉంటున్న తనను యజమాని అద్దె కోసం వేధిస్తున్నాడంటూ కేరళకు చెందిన యువకుడు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్(హెచ్ఆర్‌సీ)ను ఆశ్రయించాడు. కేరళకు చెందిన టోజో జోస్ 16 నెలలుగా ఆబిడ్స్ తిలక్‌రోడ్‌లో ఉన్న మెట్రో హాస్టల్‌లో ఉంటున్నాడు. లాక్‌డౌన్ కారణంగా జీతం రాలేదని... చేతిలో డబ్బుల్లేకపోయినా అద్దె చెల్లించాలని యజమాని వేధిస్తూ... అసభ్య పదజాలంతో దూషిస్తూ పరువు తీస్తున్నాడని కమిషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదును స్వీకరించిన కమిషన్ విచారణ జరిపి నివేదిక అందజేయాలని ఆబిడ్స్ డివిజన్ ఏసీపీని ఆదేశించింది.

ఎస్‌పై దాడి చేసిన వ్యక్తి అరెస్ట్

హైదరాబాద్,ఏప్రిల్23(ఆర్ఎన్ఎ): ఇంటి నుంచి బయటకు రావద్దని సూచించిన సబ్ ఇన్‌స్పెక్టర్‌పై దాడిచేసిన వ్యక్తిని వనస్థలిపురం పోలీసులు అరెస్టు చేశారు. లాక్‌డౌన్ నేపథ్యంలో గౌతమినగర్ రోడ్డు నంబర్ 5లో ఎస్ఐ కె. వెంకట్‌రెడ్డి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఇద్దకు వ్యక్తులు బయట ఉన్నారు. ఇంట్లోకి వెళ్లకపోతే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. చందాప్రమోద్ అనే వ్యక్తి ఆవేశంతో దురుసుగా మాట్లాడడంతో పాటు ఎస్ఐ చెంపపై కొట్టాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

చందానగర్ కార్పోరేటర్ విరాళం 50లక్షలు

హైదరాబాద్,ఏప్రిల్23(ఆర్ఎన్ఎ): ప్రాణాంతక కరోనా వైరస్‌పై పోరాడుతున్న ప్రభుత్వానికి తమవంతుగా సహాయం చేయడానికి దాతలు ముందుకువస్తున్నారు. జీహెచ్ఎంసీ 110వ డివిజన్ చందానగర్ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డి రూ. 50 లక్షల చెక్కును రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌కు విరాళంగా అందించారు. తాను 50 నెలలుగా (నాలుగు సంవత్సరాల రెండు నెలలు) అందుకుంటున్న రూ.6 వేల గౌరవవేతనం మొత్తం రూ.30 లక్షలు, బొబ్బ చారిటబుల్ ట్రస్ట్ తరపున మరో రూ. 20 లక్షలు కలిపి మొత్తం రూ. 50 లక్షలను సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందించినట్లు తెలిపారు. సైబర్ సిటీ బిల్డర్స్ ఎండీ వెణు వినోద్, డైరెక్టర్ వర్ధన్‌రెడ్డి రూ.25 లక్షల చెక్కును మంత్రి కేటీఆర్‌కు అందించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో వారు సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళంగా అందించారు.

హైదరాబాద్‌లో దేశంలోనే తొలి మొబైల్ వైరాలజీ ల్యాబ్

వివిధ సంస్థల సహకారంతో డిఆర్డిఎ రూపకల్పన వీడియో కాలింగ్ ద్వారా ప్రారంభించిన కేంద్రమంత్రులు 2వేల టెస్టులకు అవకాశం ఏర్పడిందన్న కిషన్ రెడ్డి

హైదరాబాద్,ఏప్రిల్23(ఆర్ఎన్ఎ): దేశంలోనే తొలి మొబైల్ వైరాలజీ ల్యాబ్‌ను హైదరాబాద్ ఈఎస్ఐ ఆస్పత్రిలో గురువారం కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్, కిషన్‌రెడ్డి, మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. మొబైల్ వైరల్ రీసెర్చ్ అండ్ డయాగ్నోస్టిక్ ల్యాబ్‌ను వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా కేంద్రమంత్రులు రాజ్ నాథ్ సింగ్, సంతోష్ గాంగ్వార్, కిషన్ రెడ్డి, తెలంగాణ మంత్రి కేటీఆర్‌లు ప్రారంభించారు. కరోనా నేపథ్యంలో దేశంలోనే పప్రథమంగా బహుళ ప్రయోజనకరమైన మొబైల్ వైరాలజీ ల్యాబ్‌ను నగరంలోని ఈఎస్ఐ మెడికల్ కళాశాల ఆవరణలో గురువారం ప్రారంభించారు.

డీఆర్‌డీఓ శాస్త్రవేత్తల బృందం అందించిన ఇంజనీరింగ్ పరిజ్ఞానంతో ఐకామ్, ఐక్లీన్ సంస్థ సహకారంతో దీన్ని రూపొందించారు. కరోనా వంటి వైర్‌సలపై కూడా ప్రయోగాలు చేసే విధంగా బీఎస్ఎల్-3 ప్రమాణాలు పాటించారు. దీనిలో శాస్త్రవేత్తలు, సిబ్బంది వైర్‌సల బారిన పడకుండా సురక్షితంగా ఉంటారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. 2 వేల టెస్టులు చేసే సామర్థ్యం వైరాలజీ ల్యాబ్‌కి ఉందన్నారు. కరోనాను ఎదుర్కోవడంలో టెస్టులు ఎంతో ఉపయోగపడతాయనా న్నారు. దేశవ్యాప్తంగా లక్షా 86 వేల కోవిడ్ బెడ్లను ఏర్పాటు చేశామని కిషన్‌రెడ్డి తెలిపారు. 24 వేల ఐసీయూ బెడ్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రైవేట్ కంపెనీల సహకారంతో వెంటిలేటర్లను తయారు చేయిస్తున్నామని వెల్లడించారు. అందరూ కలిసికట్టుగా కరోనాను ఎదుర్కోవాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మర్కజ్ ఘటన కారణంగానే కరోనా కేసులు పెరిగాయని పేర్కొన్నారు. కరోనా నియంత్రణకు 755 ప్రత్యేక ఆస్పత్రులను ఏర్పాటు చేసినట్టు కిషన్‌రెడ్డి వెల్లడించారు.

ప్రపంచ వ్యాప్తంగా కరోనా వల్ల విపత్కర పరిస్థితులు నెలకొన్నా.. సమిష్టి కృషితో సమర్థవంతంగా భారత్ లో కరోనాపై పోరాటాన్ని కొనసాగిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా కరోనాపై పోరులో డీఆర్డీవో గొప్ప పాత్ర పోషిస్తుందని తెలిపిన కిషన్ రెడ్డి.. డీఆర్డీఓ చైర్మన్ సతీశ్ రెడ్డికి అభినందనలు తెలిపారు. కరోనాను ఎదుర్కోవడంలో మొబైల్ వైరాలజీ ల్యాబ్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. టెస్టింగ్ సదుపాయాల కోసం ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతోందని ఆయన వివరించారు. ఇక కరోనాపై ప్రభుత్వ పోరు గురించి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో మార్చి 15 వరకు ఒక ల్యాబ్ మాత్రమే పుణెలో ఉండేది.. ఇప్పుడు దేశవ్యాప్తంగా 302 టెస్టింగ్ ల్యాబ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 755 కోవిడ్ ఆసుపత్రులను ప్రత్యేకంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిందని.. అలాగే 3060 క్వారంటైన్ సెంటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. దేశానికి కావాల్సిన పీపీఈ కిట్స్ తయారు చేసుకుంటున్నామని, వెంటిలేటర్లను తయారు చేసుకుంటున్నామని, అందరం కలిసికట్టుగా కరోనాను ఎదుర్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. తబ్లీగి జమాత్ కారణంగా తెలంగాణ , ఏపీ, ఢిల్లీ, జమ్మూ కశ్మీర్ లో అధిక కేసులున్నాయని కిషన్ రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రజలు లాక్ డౌన్ ను బాగా పాటిస్తున్నారని ఆయన కితాబిచ్చారు. గ్రామీణ ప్రజలు 'నో కరోనా' అంటుంటే పట్టణ ప్రజలు 'ఆవో కరోనా' అన్నట్టు వ్యవహరిసస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఇఎస్ఐ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కరోనా ఇప్పట్లో మనలను వీడదు

దాని కథ ఇప్పుడే ముగిసి పోలేదు

అప్రమత్తంగానే ఉండాలన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ

జెనీవా,ఏప్రిల్23(ఆర్ఎన్ఎ): కరోనా మనలను వీడిపోదని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. ఇప్పట్లో అప్పుడే కరోనా వైరస్ కథ ముగిసిపోదని ప్రపంచ ఆరోగ్య సంస్థ వార్నింగ్ ఇచ్చింది. వైరస్‌తో మనం ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంటుందని డబ్ల్యూహెచ్‌వో డైరక్టర్ టెడ్రోస్ తెలిపారు. చాలా వరకు దేశాలు ఇంకా తొలి దశలోనే ఉన్నాయన్నారు. వైరస్‌ను కంట్రోల్ చేశామని చెబుతున్న కొన్ని దేశాల్లో మళ్లీ కొత్తగా కేసులు బయటపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఆఫ్రికాలో ఇప్పుడిప్పుడే కేసులు అధికమవు తున్నాయన్నారు. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా వైరస్ వల్ల మరణించిన వారి సంఖ్య లక్షా 80 వేలు దాటింది.

జనవరి 30వ తేదీన గ్లోబల్ ఎమర్జెన్సీ ప్రకటించినట్లు టెడ్రోస్ గుర్తు చేశారు. డబ్ల్యూహెచ్‌వోపై అమెరికా ఆరోపణలు చేస్తున్నా.. తాను మాత్రం రాజీనామా చేసేది లేదని టెడ్రోస్ తెలిపారు. పశ్చిమ యూరోప్‌లో మహమ్మారి ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు టెడ్రోస్ చెప్పారు. ప్రస్తుత దశలో ఎవరూ ఎటువంటి పొరపాట్లు చేయకూడదన్నారు. మనం ఇంకా చాలా దూరం వెళ్లాల్సి ఉందన్నారు. ఈ వైరస్ మనతో చాలా కాలమే ఉంటుందన్నారు. ఫండింగ్ విషయంలో అమెరికా మళ్లీ పునర్ ఆలోచించాలని టెడ్రోస్ కోరారు. జెనీవాలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. డబ్ల్యూహెచ్‌వోకు మళ్లీ అమెరికా నిధులు ఇస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఇది ముఖ్యమైన పెట్టుబడిగా అమెరికా భావిస్తుందని అనుకుంటానన్నారు. అలా చేయడం వల్ల ఇతరులను ఆదుకోవడమే కాదు, అమెరికా కూడా సురక్షితంగా ఉంటుందన్నారు. గత ఏడాది డబ్ల్యూహెచ్‌వోకు అమెరికా 400 మిలియన్ల డాలర్లు ఇచ్చింది.

చైనా 30మిలియన్ల సాయం

మహమ్మారి కరోనాపై పోరులో ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్ఓ)కు అండగా నిలిచేందుకు 30 మిలియన్ డాలర్ల విరాళం అందజేస్తున్నట్లు చైనా ప్రకటించింది. ప్రాణాంతక వైరస్‌ను కట్టడి చేసేందుకు ఈ మేరకు సాయం అందిస్తున్నట్లు గురువారం పేర్కొంది. చైనాలోని వుహాన్ నగరంలో ఉద్భవించిన కరోనా వైరస్ తీవ్రత గురించి ప్రపంచాన్ని అప్రమత్తం చేయడంలో డబ్ల్యూహెచ్ఓ విఫలమైనందున.. ఆ సంస్థకు నిధులు నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఏడాదికి 400 నుంచి 500 మిలియన్ డాలర్ల చొప్పున సంస్థకు తాము నిధులు కేటాయిస్తుంటే... చైనా మాత్రం కేవలం 40 మిలియన్ డాలర్లు లేదా అంతకన్నా తక్కువే అందిస్తోందని ఆయన విమర్శించారు. అటువంటి దేశానికి డబ్ల్యూహెచ్ఓ మద్దతుగా నిలిచి ఇంతటి సంక్షోభానికి పరోక్ష కారణమైందంటూ దుయ్యబట్టారు.

ఈ క్రమంలో అంటువ్యాధి ప్రబలుతున్న సమయంలో అమెరికా తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని చైనా విజ్ఞప్తి చేసింది. ఇక నిధుల నిలిపివేతపై అమెరికా పునరాలోచన చేస్తుందని డబ్ల్యూహెచ్ఓ డైరక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా అమెరికా నిర్ణయంపై స్పందించిన డబ్ల్యూహెచ్ఓ అత్యవసర విభాగం చీఫ్ మైక్ ర్యాన్.. నిధుల కొరత సంస్థ ప్రధాన కార్యకలాపాలపై ప్రభావం చూపుతోందని అన్నారు. వివిధ వైద్య సేవలకు ఆటంకం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో డ్రాగన్ దేశం తాజాగా 30 మిలియన్ డాలర్లు అదనంగా డబ్ల్యూహెచ్ఓకు విడుదల చేయడం గమనార్హం.

కంటైన్‌మెంట్ ప్రాంతాల్లో గట్టి నిఘా

బయటకు రాకుండా పోలీసులు గస్తీ

దారులన్నీ మూసేసిన పోలీసులు

నిరంతరంగా పర్యవేక్షిస్తున్న మంత్రులు, అధికారులు

హైదరాబాద్,ఏప్రిల్23(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ నగరంలోని వివిధ కంటైన్‌మెంట్ ప్రాంతాల్లో గస్తీ పెరిగింది. పోలీసులు ఈ ప్రాంతాలను పూర్తిగా మూసేశారు. ఏ ఒక్కరు కూడా బయటకు రాకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఈ ప్రాంతాలను మిగతా ప్రాంతాలతో లింకులు లేకుండా మూసేశారు. ఈ ప్రాంతాల ప్రజలు బయటకు రాకుండా కట్టడి చేస్తున్నారు. నగరంలో పాజిటివ్ కేసుల సంఖ్య పెరగడంతో సిఎం కెసిఆర్ ఆదేవాల మేరకు మంత్రులు కెటిఆర్, తలసాని, అధికారులు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో నాలుగు పాజిటివ్ కేసులు మాత్రమే ఉన్నాయి. జోన్ పరిధిలోని బోయినపల్లి, హస్మత్‌పేట్, ఎల్లమ్మబండ, కేపీహెచ్‌బీ పరిధిలో కంటైన్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేశారు. రోజూ జీహెచ్‌యంసీ, ఆరోగ్య, పోలీస్ అధికారులు ప్రజలకు సేవలు అందిస్తున్నారు. కొత్తగా పాజిటివ్ కేసులు నమోదు కాకపోవడంతో పాత కంటైన్‌మెంట్ సెంటర్‌లనే కొనసాగిస్తున్నట్లు జోనల్ కమిషనర్ మమత తెలిపారు. అంబర్‌పేట నియోజకవర్గంలో కంటైన్మెంట్ ప్రాంతాలు క్రమంగా తగ్గుతున్నాయి. నాలుగు రోజుల క్రితం రామకృష్ణానగర్‌లో కరోనా బాధితుడి క్వారంటైన్ పూర్తి కావడంతో ఆప్రాంతాన్ని కంటైన్మెంట్ జోన్ నుంచి తొలగించారు. గోల్నాక గంగానగర్‌లో ఓ నర్సుకు కరోనా పాజిటివ్ రావడంతో ఆ ప్రాంతాన్ని కంటైన్‌మెంట్ జోన్‌గా ప్రకటించారు. మలక్‌పేట్, మహేశ్వరం నియోజకవర్గాల పరిధిలోని బాల్దాపూర్ కంటైన్‌మెంట్ క్లస్టర్లలో మొత్తం 18 పాజిటివ్ కేసులు, మలక్‌పేట్ కంటైన్మెంట్ క్లస్టర్‌లో మొత్తం 48 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. బాలాపూర్ (జల్‌పల్లి మున్సిపాలిటీ), మలక్‌పేట్ కంటైన్మెంట్ కస్టర్ల పరిధిలోని వాదే ముస్తఫా, షాహీన్‌నగర్, మిలాన్ కాలనీ, కొత్తపేట, బిస్మిల్లాఖాన్ కాలనీ, పహాడీషరీఫ్, ఓల్డ్ మలక్‌పేట, శంకర్‌నగర్, వాహెద్‌నగర్, కాలాదేరా, అజంపురం, న్యూమలక్‌పేట్, రేస్‌కోర్స్ ప్రాంతాల్లోని ప్రజలకు నిత్యావసర వస్తువులను ఇళ్ల వద్దకే పంపిణీ చేస్తున్నారు. అక్బర్‌బాగ్ డివిజన్ పరిధిలోని జ్జడేస్ కాలనీకి చెందిన ఓ నర్సుకు కరోనా పాజిటివ్ వచ్చింది. బుధవారం వైద్యశాఖ అధికారులు, జీహెచ్ఎంసీ సిబ్బంది ఆ ప్రాంతాన్ని క్వారంటైన్ జోన్‌గా ప్రకటించారు. చార్మినార్ జోన్ పరిధిలోని నాలుగు సర్కిళ్లలో కంటైన్మెంట్ క్లస్టర్లు కొనసాగుతున్నాయి. ఇందులో సంతోష్‌నగర్ సర్కిల్ 7లో కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. యాకుత్‌పురా నియోజకవర్గ పరిధిలో ముగ్గురు వ్యక్తులు కరోనాతో మృతి చెందారు. వారి నుంచి కరోనా పాజిటివ్ ప్రైమరీ కాంటాక్టస్ పెద్ద సంఖ్యలో నమోదయ్యాయి. ప్రస్తుతం ఇక్కడ 15 కంటైన్మెంట్ క్లస్టర్లు కొనసాగుతుండగా, 58 మందికి కరోనా పాజిటివ్ వచ్చింది. ఇందులో ముగ్గురి పరిస్థితి మెరుగుపడడంతో ఇప్పటికే డిశ్చార్జి అయ్యారు. మరో 53 మంది చికిత్స పొందుతున్నారు. చాంద్రాయణగుట్ట సర్కిల్ 8లో 10 క్లస్టర్లుండగా.. 35 మంది కరోనా పాజిటివ్‌తో వైద్య సేవలు పొందుతున్నారు. ఇప్పటి వరకు ఒకరు మృతి చెందారు. చార్మినార్ సర్కిల్ 9లో నాలుగు కంటోన్మెంట్ క్లస్టర్లు కొనసాగుతుండగా.. ఇప్పటి వరకు ఒకరు మృతి చెందారు. మరో 7 మంది కరోనా పాజిటివ్‌తో వైద్య సేవలు పొందుతున్నారు. ఫలక్‌నుమా సర్కిల్ 10లో 6 కంటైన్మెంట్ క్లస్టర్లు కొనసాగుతుండగా ఇద్దరు మృతి చెందారు. 25 మంది కరోనా పాజిటివ్‌తో చికిత్స పొందుతున్నారు. చార్మినార్ యునానీ ఆసుపత్రిలో ఇప్పటి వరకు 38 మంది క్వారంటైన్‌లో ఉండగా ఇందులో 26 మందికి నెగెటివ్‌గా రిపోర్టులు వచ్చాయి. వీరందరినీ డిశ్చార్జి చేశారు. ప్రస్తుతం 12 మంది ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు.నత్‌నగర్ నియోజకవర్గంలో ఇప్పటివరకు ఎనిమిది పాజిటివ్ కేసులు నమోదుకాగా ఐదుగురు కోలుకొని డిశ్చార్జి అయ్యారు. మిగిలిన ముగ్గురి ఆరోగ్యం సైతం నిలకడగా ఉన్నట్లు సమాచారం. రాంగోపాల్‌పేట డివిజన్‌లో అత్యధికంగా ఆరు కరోనా పాజిటివ్ కేసులు నమోదు కాగా, బేగంపేట పాటిగడ్డలో ఒకటి, అమీర్‌పేట డివిజన్ బల్కంపేటలో మరో పాజిటివ్ కేసు నమోదు కావడంతో ఆయా ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. రాంగోపాల్‌పేట డివిజన్ జీరా ప్రాంతానికి చెందిన ఓ వ్యాపారి దుబాయ్ నుంచి వస్తూ కరోనాను మోసుకువచ్చారు. దీంతో ఆయన భార్య, కుమారుడికి కరోనా పాజిటివ్ నమోదయ్యాయి. వీరే కాకుండా కరోనా లక్షణాలతో సదరు వ్యాపారి కోడలు, మనువడు, మనుమరాలు, వారి కారు డ్రైవర్, పని మనిషిలతో పాటు వారితో సన్నిహితులు పది మందిని పరీక్షించగా ముగ్గురికి పాజిటివ్‌గా వచ్చింది. సౌదీ నుంచి వచ్చిన బేగంపేట డివిజన్ పాటిగడ్డకు చెందిన వృద్ధురాలికి కరోనా పాజిటివ్‌గా తేలింది. చికిత్స అనంతరం ఆమె డిశ్చార్జి అయ్యి హోం క్వారంటైన్‌కు చేరుకున్నారు. బల్కంపేటలోని ఓ వ్యక్తి సైతం కోలుకుని హోం క్వారంటైన్‌లో ఉన్నారు. తాజాగా రాంగోపాల్‌పేట్, నల్లగుట్టలో ఇరాన్‌కు చెందిన వ్యక్తితో పాటు ఇద్దరు స్థానికులకు కరోనా పాజిటివ్ రావడంతో వీరిని గాంధీ ఆస్పత్రిలోని ఐసోలేషన్ వార్డుకు తరలించారు. వీరితో కాంటాక్ట్ అయిన వారందరి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. జియాగూడ ప్రాంతంలో ఆగ్రా నుంచి మర్కజ్ ప్రయాణికులతో కలిసి నగరానికి చేరుకున్న వారిలోని కుటుంబ సభ్యులకు ఇద్దరికి పాజిటివ్ వచ్చింది.ఈ ఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగు చూసింది. పోలీసుల వివరాల ప్రకారం...సబ్జిమండి దర్వేజ్ ఫంక్షన్‌హాల్‌కు ఎదురుగా నివసిస్తున్న ఓమహిళకు ఇద్దరు కొడుకులు, ఒక కోడలు ఉన్నారు. గత నెల 17న ఆగ్రా నుంచి మర్కజ్ యాత్రికులతో కలిసి ఆమె కుమారుడితో నగరానికి వచ్చారు. అనుమానతో వీరిని గాంధీ ఆసుపత్రికి తరలించగా ఇద్దరికి పాజిటివ్‌గా వచ్చింది. దీంతో సబ్జిమండి ప్రాంతంలో కంటైన్మెంట్ జోన్‌గా ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో కంటైన్మెంట్ల సంఖ్య ఆరుకు చేరింది. ఇప్పటికే లాలగూడ, మెట్టుగూడ, శ్రీనివాస్‌నగర్, కౌసర్ మసీద్, బౌద్ధనగర్ ప్రాంతాల్లో కంటైన్మెంట్లు ఏర్పాటు చేసిన జీహెచ్ఎంసీ అధికారులు కొత్తగా షాబాద్‌గూడలో మరో కంటైన్మెంట్‌ను ఏర్పాటు చేశారు. షాబాద్‌

ఎవరికీ ఏమీ కాకుండా పోతామనేది నిజం. ..!

నేటినిజం
శుక్రవారం 24-4-2020

మనం మన తోటివారు ఒకరు పదవికోసం, మరొకరు కీర్తికోసం పోరాటం,ఒకరినొకరు నిందించుకోవడం, లాంటివి మాత్రమే అనుకుంటే పొరపాటే... నేడు ప్రతిచోట, మనిషికి మనిషికి మధ్య ఏపాటి అవసరం ఉన్నా లేకున్నా మనచుట్టూ రాజకీయాలు పరిభ్రమిస్తూనే వున్నాయి. ముఖ్యంగా నగరంలో అపార్ట్‌మెంట్స్‌లో అయితే పక్కపక్కనే వున్నా ఒకరంటే ఒకరికి పడని పరిస్థితులు నెలకొన్నాయి...ఇక్కడా ప్రెసిడెంట్ పోటీలు, ఓట్లు, గెలుపు ఓటమిల మధ్య కోపతాపాలు, అపార్ట్‌మెంట్స్‌లో మీ పిల్లల వల్ల నిత్యంపోరాటం, లేదా ఎక్కడో పైప్‌విరిగిందనో, మోటర్‌పాడయ్యిందనో,లిఫ్ట్ రిపేర్ అనో, నిత్యం డబ్బు వసూలు చేయడం, మెయింటేనెన్స్ అంటూ నెలకు వెయ్యిదాకా వసూలుచేయడం, అవీకాకుండా ఏదో పండగలంటూ అని డబ్బులు వసూలుచేయడం, అందులో వచ్చేలాభాలు నువ్వు తిన్నావని, లేదు నవ్వుతిన్నావని, నిత్య పోరాటాలతో రాజకీయాలను మించిపోతున్నాయి.. ఇలా వుండటం వల్ల ఒకరింటి వైపు ఒకరు పలకరించుకోరు. మొక్కుబడిగా నెలకోసారి మీటింగ్ అంటూ కలుస్తారు తప్ప మరేవిధమయిన బాధ్యత తీసుకోరు.

అలాకాకుండా, ఒకరు లేకున్నా మరొకరు ఆ ఇంటికి కాపలా వుంటూ, నేడు జరిగే దొంగతనాలను, మోసాలను అరికట్టవచ్చు. ఇలా ఎవరికి పట్టనట్టు వారుండటంతో ఎవరు ఎందుకు దిగుతున్నారు? వారిలో నమ్మకస్తులు ఎవరు? మోసంతో చేరిన వారు ఎందరని కూడా కనిపెట్టే అవకాశం వుంటుంది.. ఎందుకంటే మనమధ్యే ఒక తీవ్రవాది చేరవచ్చు.. లేదా ఉగ్రవాది వుండవచ్చు. మనలో మనం ఇలా పోట్లాడుకోవడం వారికి చేయాల్సిన పని సులభం అవుతుంది... ఒక్క అపార్ట్‌మెంట్స్‌లోనే కాదు కాలనీల్లో కూడా ఇదే విధమయిన పరిస్థితి నెలకొంటోంది. ప్రతీదీ ప్రభుత్వం పట్టించుకోవాలని, మనకేమీ సంబంధంలేదని కూర్చుంటే మనకు మనం ఎవరికీ ఏమీ కాకుండా పోతామనేది నిజం.

ఆయాసరంధిత అధికారులు మనతోనే వుండాలనుకోవడం పొరపాటు. ఎందుకంటే మనలోనే శత్రువున్నాడు... మనమధ్యలోనే ప్రమాదం పొంచివుంటోంది. ఇవేవీ గమనించుకోకుండా మనకు కావాల్సిన కీర్తికోసమో, సంపాదనకోసమో, నిత్యం ప్రయత్నిస్తూ, ఒకరిపై నిందవేయడమో, ఒకరిని తూలనాడటంలోనో మన జీవితాన్ని వెచ్చించడంవలన అవకాశం కోసం చూస్తున్న శత్రువు బలవంతుడవుతాడు. తద్వారా ఉనికి కోల్పోయే ప్రమాదం ఉంది. కలసివుంటే కలదుసుఖం అనేది ఒకప్పటి మాట. నేడు కలసివుంటేనే బతకవచ్చనేది నేటి మాట.. దాన్ని మనం నిత్యం అవలంబించాలి.ఏ నిముషంలో ఏ ప్రమాదం వస్తుందో, ఏక్షణం ఏ అవాంతరం ముంచుకొస్తుందో, అని నిత్యం భయపడుతున్న వాతావరణంలో మనలో మనం ప్రతినిత్యం అప్రమత్తతతో వుండాలి. ఒక వ్యక్తి ఎంత గొప్పవాడైనా, ఎంత గొప్ప అధికారి అయినా, కోటీశ్వరుడైనా ఒకనాడు తనువు చాలించాల్సిందే...వేలకొలది ఎకరాల భూమి కొనుక్కున్నా, భూమి వున్నంతకాలం మనం వుండమే సంగతి గుర్తించాలి... ప్రస్తుతం మనల్ని మనమే కాపాడుకోవాలి. ఎక్కడో బాంబుబ్లాస్ట్ అయితేనో, అరాచకాలు జరిగితోనో, ప్రతిపక్షాల కుట్రని పాలకవర్గం, పాలకవర్గం అసమర్థత అని ప్రతిపక్షం, ప్రభుత్వ వైఫల్యం అని ప్రజలు అనుకోవడం సమయం వృధా తప్ప, మనల్ని ఎవరూ కాపాడరు.. నిత్యం రోడ్డుపైన బస్సుకోసమో, ఆటోకోసమో, జనం రద్దీగా వున్న ప్రాంతాల్లో మనమే వుంటాం... మన ఇంట్లో మనమే ఒంటరిగానూ ఉంటాం. కనుక మనస్థితిని మనమే గుర్తించుకోవాలి. మనలో మనం కలిసి మెలసి ఒకరినొకరు సాయం చేసుకునే తీరులో కాలనీలు, అపార్టుమెంట్స్ వుండాలి. ఒకరినొకరు అర్థం చేసుకుంటూ మనల్ని మనమే కాపాడుకుంటే ఎన్నో ప్రమాదాల నుండి మనం బయటపడవచ్చు! ఆలోచించండి!!

ఎపిలో కొత్తగా మరో 80 కరోనా కేసులు

కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 893కి చేరిక

కర్నూలులో కట్టడికి చర్యలు తీసుకుంటున్నాం: మంత్రి

అమరావతి,ఏప్రిల్23(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా మరో 80 కరోనా కేసులు నమోదయ్యాయి. దీంతో ఏపీలో మొత్తం కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 893కి చేరింది. ఈ మేరకు రాష్ట్ర నోడల్ అధికారి హెల్త్ బులిటెన్ విడుదల చేశారు. గడిచిన 24 గంటల్లో అనంతపురం జిల్లాలో 6, చిత్తూరు జిల్లాలో 14, తూర్పు గోదావరి జిల్లాలో 6, గుంటూరు జిల్లాలో 18, కృష్ణా జిల్లాలో 2, కర్నూలు జిల్లాలో 31, విశాఖపట్నం జిల్లాలో 1, ప్రకాశం జిల్లాలో 2 కరోనా పాజిటివ్ కేసులు నమోదైనట్టు పేర్కొన్నారు. గడిచిన 24 గంటల్లో ఏపీలో 21 మంది కరోనా నుంచి కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు.. దీంతో ఇప్పటివరకు కరోనా నుంచి కోలుకున్న వారి సంఖ్య 141కి చేరింది. కొత్తగా కరోనాతో ఇద్దరు మృతిచెందడంతో.. మొత్తం మృతుల సంఖ్య 27గా నమోదైంది. కాగా, ప్రస్తుతం రాష్ట్రంలో 725 కరోనా యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఇకపోతే కరోనా వైరస్ నియంత్రణలో భాగంగా ఏపీ ప్రభుత్వం అన్ని కట్టుదిట్టమైన చర్యలను చేపడుతోంది. ఈ నేపథ్యంలోనే కరోనా పరీక్షల నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ప్రతీ పది లక్షల జనాభాకుగానూ ఏపీ సర్కార్ 830 కరోనా పరీక్షలు నిర్వహించింది. ఏపీ తర్వాత రాజస్తాన్ 809 మందికి పరీక్షలు నిర్వహించి రెండో స్థానంలో నిలిచింది. ఇక ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 41,512 పరీక్షలు చేపట్టింది. అంతేకాక నిన్న ఒక్క రోజే 5,757 మందికి టెస్టులు నిర్వహించమని ఏపీ ఆరోగ్యశాఖ వెల్లడించింది. కాగా, రాష్ట్రంలో ఇప్పటివరకు 813 కరోనా కేసులు నమోదయ్యాయి. ఇదిలావుంటే కర్నూలులో కరోనా కట్టడికి సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని మంత్రి ఆళ్ల నాని చెప్పారు. కర్నూలు జిల్లాలో 37 రెడ్‌జోన్లను గుర్తించామని, ప్రతి రెడ్‌జోన్‌లో ఫీవర్ ఆస్పత్రి ఏర్పాటు చేస్తామని తెలిపారు. కర్నూలులో స్టేట్ కోవిడ్ ఆస్పత్రి, పీసీఆర్ ల్యాబ్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆళ్ల నాని ప్రకటించారు. కర్నూలు జిల్లాలో 234 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఏపీలో 893కు కరోనా పాజిటివ్ కేసులు చేరాయి. గడిచిన 24 గంటల్లో కొత్తగా 80 కేసులు నమోదయ్యాయి, ముగ్గురు మృతి చెందారు. కర్నూలు జిల్లాలో ఇద్దరు, కృష్ణా జిల్లాలో ఒకరు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. కర్నూలులో 31, గుంటూరులో 18, చిత్తూరులో 14, తూర్పుగోదావరిలో 6, అనంతపురంలో 6, ప్రకాశంలో 2, కృష్ణా జిల్లాలో 2, విశాఖలో ఒక పాజిటివ్ కేసు నమోదయింది. ఏపీలో ఇప్పటి వరకు 141 మంది డిశ్చార్జ్ చేశారు. 725 మందికి చికిత్స అందిస్తున్నారు. ఏపీలో ఇప్పటి వరకు కరోనాతో 27 మంది మృతి చెందారు.

టిడిపి నేతలకు రాజకీయాలు తప్ప మరోటి పట్టవు

-దాడిశెట్టి రాజా ఆగ్రహం

కాకినాడ,ఏప్రిల్23(ఆర్ఎన్ఎ): కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా రాష్ట్ర ఆదాయం కోసం మాట్లాడుతన్న టీడీపీ నేతలు యనమల రామకృష్ణుడు, కళా వెంకట్రావులకు సిగ్గుండాలని ఏపీ ప్రభుత్వ విప్ దాడిశేట్టి రాజా మండిపడ్డారు. వీరికి రాజీయాలు తప్ప ప్రజలు ,బాధులు పట్టవన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గతంలో మేము అప్పటు చేసి రాష్ట్రాన్ని దీవాళ తీశామని.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలించలేరని చెప్పిన మాటలు యనమలకు గుర్తులేదా అన్నారు. బురదలో పందులు దొర్లుతున్నాయి.. మీరు దోర్లుతున్నారు ?కాస్తా బాధ్యతగా మాట్లాడమని యనమల, వెంకట్రావ్‌లను ఆయన హెచ్చరించారు. ఇక ఎల్లో మీడియాలో గంటల తరబడి చంద్రబాబు చేస్తున్న ప్రసంగం విని... ప్రజలు మాకీ కర్మేంటి బాబు అంటూ దండాలు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజల బాగోగులు చూడకుండా ప్రతి అరగంటకు పచ్చ మీడియా ముందు ప్రెస్‌మిట్‌లు పెట్టేవారన్నారు. ప్రజల హృదయం తెలిసిన వ్యక్తి సీఎం జగన్ అన్నారు. లాక్‌డౌన్ వంటి పరిస్థితుల్లో మహిళలకు వడ్డీలేని రుణాలు ఇచ్చి అన్ని వర్గాల ప్రజలను ఆర్థికంగా ఆదుకుంటున్నారని పేర్కొన్నారు. కరోనా పరీక్షల్లో దేశంలోనే ఏపీ మొదటి స్థానంలో ఉందని కేంద్రమే గుర్తించిందని చెప్పారు. కరోనాను అరికట్టడంలో సీఎం జగన్ విజయం సాధిస్తున్నారన్నారు. అంతేగాక దేశానికి దిక్చూచిగా కరోనాను నివారిస్తారని ఆయన అన్నారు.

మాజీమంత్రి నారాయాణకు మాతృవియోగం

నెల్లూరు,ఏప్రిల్23(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి నారాయణ ఇంట్లో విషాదం నెలకొంది. గురువారం ఉదయం నారాయణకు మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి పొంగూరు సుబ్బమ్మ మృతి చెందారు. సుబ్బమ్మ వయస్సు 85 సంవత్సరాలు. ఆమెకు ఇద్దరు కుమారులు.. ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె మృతి చెందినట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, పార్టీకి చెందిన నేతలు, పలువురు ప్రముఖులు నారాయణకు ఫోన్ చేసి పరామర్శించారు. శుక్రవారం సుబ్బమ్మ అంత్యక్రియలు జరగనున్నట్లు తెలుస్తోంది.

మేలో పద్మావతి అమ్మవారికి వసంతోత్సవాలు

తిరుపతి,ఏప్రిల్23(ఆర్ఎన్ఎ): తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో మే 6 నుంచి 8వ తేదీ వరకు వార్షిక వసంతోత్సవాలు జరుగనున్నాయి. ఇందుకోసం మే 5న అంకురార్పణ నిర్వహిస్తారు. కరోనా వైరస్ వ్యాప్తి నివారణ చర్యల్లో భాగంగా ఈ ఉత్సవాలను ఆలయ ప్రాంగణంలోనే ఏకాంతంగా నిర్వహిస్తారు.ఈ ఉత్సవాల్లో భాగంగా మే 6 నుంచి 8వ తేదీ వరకు మూడు రోజుల పాటు మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు ఆలయంలో అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం చేపడతారు. అలాగే రాత్రి 7 నుంచి 7.30 గంటల వరకు ఆలయ ప్రాంగణంలోనే అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాల కారణంగా మే 5 నుంచి 8వ తేదీ వరకు కల్యాణోత్సవం, సహస్రదీపాలంకారసేవ, మే 6న అష్టోత్తర శతకలశాభిషేకం, మే 7న తిరుప్పావడసేవ, మే 8న లక్ష్మీపూజ ఆర్జితసేవలను టిటిడి రద్దు చేసింది.

పెన్షనర్లు పూర్తి చెల్లింపులు చేయాలి

-జగన్‌కు చంద్రబాబు లేఖ

అమరావతి,ఏప్రిల్23(ఆర్ఎన్ఎ): రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులకు పూర్తి స్థాయిలో పెన్షన్ చెల్లించాలని ముఖ్యమంత్రి జగన్‌ను టీడీపీ అధినేత చంద్రబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన సీఎంకు లేఖ రాశారు. మార్చి నెలకు సంబంధించి సగం జీతాలే వారికి చెల్లించడం సరైన నిర్ణయం కాదన్నారు. సుదీర్ఘకాలం ప్రభుత్వ సేవలందించిన వారిపట్ల ఈ తరహా చర్య సబబు కాదన్నారు. పెన్షనర్ల జీత భత్యాల్లో ఎలాంటి కోత విధించరాదని చట్టం స్పష్టం చేస్తోందన్నారు. పెన్షన్ అందుకునే వారంతా 60 ఏళ్లు పైబడిన వారేనని, ఈ వయసు వారికి కరోనా వ్యాపించే అవకాశాలు ఎక్కువ అని లేఖలో పేర్కొన్నారు. వయోభారంతో వచ్చే అనారోగ్య సమస్యలకు వైద్య ఖర్చులు అధికంగా ఉంటాయని, కావున తక్షణమే 100 శాతం పెన్షన్ చెల్లించాలని చంద్రబాబు డిమాండ్ చేశారు.

వ్యాక్సిన్ కోసం ముమ్మర పరిశోధనలు

హైదరాబాద్, ఏప్రిల్ 23:ప్రపంచాన్ని వణికిస్తోన్న కరోనా వైరస్ అంతం ఎప్పుడు అన్న ప్రశ్న ఇప్పుడు అందరినీ వేధిస్తోంది. దీనికి వ్యాక్సిన్ కనిపెట్టే దిశగా ప్రపంచంలోని అన్ని దేశాలు సీరియస్‌గా పనిచేస్తున్నాయి. భారతదేశంలో ఆధ్యాత్మికత, భగవంతుడిపై నమ్మిక ఎక్కువ కనుక కరోనా నివారణకు పూజాపునస్కారాలు కూడా సాగు తున్నాయి. సాధారణంగా ఏదైనా వ్యాక్సిన్ తయారు చేయాలంటే కనీసం రెండేళ్ల సమయం పడు తుంది. అయితే అంతదాకా వేచి చూడ కుండా అభివృద్ధి చెందిన అన్ని దేశాలు ఇప్పుడు వైరస్‌కు విరుగుడుగా వ్యాక్సిన్ కోసం పరిశోధనలు ఉధృతం చేశాయి. అమెరికా, భారత్,జర్మన్,ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, లండన్ ఇలా అన్ని దేశాలు తమవంతుగా వైరస్ నిర్మూలనకు వ్యాక్సిన్ కోసం 24గంటలపాటు శ్రమిస్తు న్నాయి. భారత్ కూడా అందుకు దీటుగా పనిచేస్తోంది. యువ శాస్త్రవేత్తలు దీనిపై దృష్టి పెట్టాలన్న ప్రధాని మోడీ పిలుపు మేరకు మనదేశంలో ఉన్న అనేక పరిశోధ నాలయాలు నిరంతరాయంగా పనిచేస్తున్నాయి. వచ్చే ఆరునెలల్లో దీనికి ఓ రూపం రావచ్చని ప్రపంచ దేశాలు విశ్వాసంగా ఉన్నాయి. అయితే అప్పటి వరకు మానవ వినాశాన్ని తప్పించడం తక్షణ కర్తవ్యం. అందుకే లాక్‌డౌన్‌తో ప్రపంచ దేశాలు కరోనా చైన్ బ్రేక్ చేసేందుకు నిరంతరాయంగా కృషి చేస్తున్నాయి. మరోవైపు ప్రపంచాన్ని అగాథంలోకి నెట్టిన ఈ వైరస్ కారణంగా ఇప్పుడు అన్ని రంగాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. గతంలో ఎప్పుడు కూడా ఇలాంటి ప్రభావం మానవ జీవితాలపై పడలేదు. ప్రపంచాన్ని లాక్‌డౌన్ చేసిన ఏకైక వైరస్ ఇదేనని ..ఇక ముందు ఇలాంటి వైరస్ మరోటి ఉంటుందా అన్నది కూడా అనుమానమే. ప్రజల జీవనవిధానంలో గాడి తప్పడం, విచ్చలవిడిగా వ్యవహరించడం వల్లనే ఇప్పటికే అనేక వైరస్‌లు వచ్చి మానవుడిని చుట్టిముట్టి భయానికి గురిచేశాయి. ఎయిడ్స్, ఎబోలా, సార్స్, స్వైన్ వంటి వైరస్‌లన్నీ కూడా మన విచ్చలవిడి తనానికి, ప్రకృతిని వినాశనం చేసినందుకే వచ్చి పడ్డాయి. కరోనా వీటికి పరాకాష్టగా చెప్పుకోవాలి. అందుకే దీని ముప్పు తప్పించుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఇకపోతే ఈ మహమ్మారి వైరస్ ఎప్పటికప్పుడు రూపం మార్చుకుంటుందని తేలింది. ఇప్పటికే 30 కంటే ఎక్కువ జాతులుగా ఇది రూపాంతరం చెందిందని చైనా శాస్త్రవేత్తల పరిశోధన లో తేలింది. కరోనా మహమ్మారి జన్యుపరంగా వివిధ మార్పులకు గురవుతున్నట్లు గుర్తించారు.ఇది మరింత ఆందోళన కలిగించే అంశమే. రూపాలు మార్చుకుంటూ కరోనా మరింత ప్రమాదకారిగా మారుతుంది. ఈ పరిణామం కరోనాను నివారించే క్రమంలో మరిన్ని సమస్యలు తెస్తుందని దీనిపై అధ్యయనం చేసిన హాంగ్జూలోని బెజియాంగ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లి లాంజూవాన్ తెలిపారు. . మొత్తం 1264 మంది కరోనా బాధితుల్లో 11 మంది నుంచి సేకరించిన నమూనాల్ని ఆయన విస్తృతంగా పరిశోధన చేశారు. 30 జాతులుగా మారిన కరోనాలో కొన్ని బలహీనంగా మరికొన్ని బలంగా ఉన్నాయని గుర్తించారు. బలంగా ఉన్న కరోనా వైరస్ దాదాపు 270 రెట్లు వేగంగా వైరస్‌ను ఉత్పత్తి చేస్తున్నదన్నారు. ఇలాంటి వైరస్‌లు సోకిన వారి కణాలపై వైరస్ వేగంగా దాడిచేసి వారి ప్రాణాలను హరిస్తోంది. అందుకే మానవాళిని రక్షించు కునేందుకు వీలైనంతంగా త్వరగా వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరముందని లి లాంజూవాన్ తెలిపారు. ఐతే వ్యాక్సిన్ తయారీలో కచ్చితంగా జన్యు మార్పులను పరిగణలోకి తీసుకోవాలని ఆయన సూచిస్తున్నారు. ఇప్పటికే పలు దేశాల్లో విజృంభిస్తున్న కోరనా ఒక్కో దేశంలో ఒక్కో రూపంలో ఎఫెక్ట్ చూపుతోంది. దానికి అనుగుణంగా వ్యాక్సిన్ ఉండాలంటున్నారు. లేదంటే పూర్తి స్థాయిలో కరోనా నివారణ సాధ్యం కాదని చెబుతున్నారు. డబ్ల్యూహెచ్ఓ లెక్కల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 70 వ్యాక్సిన్లు పలు దశల్లో తయారీలో ఉన్నాయి. 3 వ్యాక్సిన్లు మనుషులపై ప్రయోగ దశల్లో ఉన్నాయి. యూకేలో మనుషులపై

కరోనా వైరస్ వ్యాక్సిన్ ప్రయోగం ప్రారంభమవుతుందని ఆ దేశ ఆరోగ్యశాఖ మంత్రి మాట్ హాన్‌కాక్ తెలిపారు.మనుషులపై కరోనా వైరస్ వ్యాక్సిన్ 80శాతం ఫలితాలు విజయవంతం అవుతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. పరిశోధనల్ని విజయవంతం చేసేందుకు ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ సైంటిస్ట్‌లు నిర్విరామంగా కృషిచేస్తున్నారన్నారు. ఆక్స్ ఫర్డ్‌తో పాటు ఇంపిరీయల్ కాలేజ్ సైంటిస్ట్‌లు కూడాపరిశోధనలు చేస్తున్నారని, ఇందుకు 20మిలియన్లను కేటాయించినట్లు చెప్పారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ సైంటిస్ట్‌లు ట్రయల్స్ పూర్తయ్యే లోపల పెద్దమొత్తంలో వ్యాక్సిన్ తయారు చేసేలా ఎ÷-లాన్ చేస్తున్నారని, సెప్టెంబర్ నాటికి ఒక మిలియన్ టీకాలు సిద్ధంగా ఉంటాయన్నారు. ఈలోగా కరోనాను అడ్డుకునేందుకు లాక్‌డౌన్ ,సోషల్ డిస్టెన్స్ పాటించడమే ప్రత్యామ్నాయ మార్గాలని మాట్ తెలిపారు. మాట్ ప్రకటనను బ్రిటిష్ మెడికల్ అసోసియేషన్ ఛైర్మన్ డాక్టర్ చాంద్ నాగ్‌పాల్ స్వాగతించారు. కరోనావైరస్ వ్యాక్సిన్ కోసం పరీక్షలు ప్రారంభమవు తున్నాయని, ఆ పరిశోధనలు సానుకూలంగా ఉంటాయన్నారు. వ్యాక్సిన్‌ను వీలైనంత త్వరగా అభివృద్ధి చేయడానికి సమిష్టిగా కృషి చేస్తున్నామని, వ్యాక్సిన్ అందుబాటులోకి వస్తే కరోనాను అడ్డుకుంటామని నాగ్‌పాల్ తెలిపారు. మొత్తంగా ప్రపంచదేశాలు వ్యాక్సిన్ కనుగొనే ప్రయత్నంలో బిజీగా ఉన్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ఇప్పటికే పరిశోధనలు ఆశాజనకంగా ఉన్నాయని ప్రకటించారు.త్వరలోనే వ్యాక్సిన్ వస్తుందన్నారు. మొత్తంగా ప్రపంచం గతంలో ఎప్పుడూ లేనంత సీరియస్‌గా కరోనా వైరస్‌కు వ్యాక్సిన్ కనిపెట్టే ప్రయత్నంలో నిమగ్నం అయ్యింది. ఇది సఫలం అయితే తప్ప మనావమనుగడ సాధ్యం కాదు. ఇప్పుడున్న లెక్కల ప్రకారం ఒక వేళ వ్యాక్సిన్ అందుబాటులోకి రాకుంటే సామాజిక దూరం కనీసం రెండేళ్ల పాటు కొనసాగిస్తే తప్ప కరోనా చైన్‌ను బ్రేక్ చేయలేమంటున్నారు. కనీసం ఇప్పటికైనా ప్రజలు తమ కర్తవ్యాన్ని గుర్తించి మసలుకోకుంటే మారణహోమం మాత్రం తప్పదని గుర్తించాలి.

మేలో మరింత తీవ్రం కానున్న కరోనా

పాజిటివ్ కేసులు పెరుగుతాయంటున్న అధ్యయనం

సామాజిక మాధ్యమాల్లోనూ విపరీతంగా చక్కర్లు

న్యూఢిల్లీ,ఏప్రిల్23(ఆర్ఎన్ఎ): భారత్‌లో కరోనా వైరస్ ప్రతాపం మేరెండో వారంలో తీవ్ర స్థాయిలో ఉంటుందని ప్రచారం సాగుతోంది. అప్పటి వరకు 28రోజుల క్వారంటైన్ పూర్తయిన వారిలో వైరస్ లోణాలు బయటపడతాయని అంటున్నారు. మరోవైపు అప్పటి వరకు పాజిటివ్ కేసుల సంఖ్య 75 వేల వరకూ ఉంటుందని ఓ మీడియా సంస్థను ఉద్దేశించిన కథనాలు భయాందోళనకు గురి చేస్తున్నాయి. సామాసిక మాధ్యమాల్లో ఇప్పుడీ వార్త చక్కర్లు కొడుతోంది. ఒక ప్రముఖ మీడియా సంస్థ, ప్రొటివిటి అనే అంతర్జాతీయ కన్సల్టింగ్ సంస్థ సంయుక్త అధ్యయనంలో తేలింది. మే నెల మధ్యలో కరోనా బాధితుల సంఖ్య ఉచ్ఛ స్థాయిలో ఉంటుందని ఈ అధ్యయనం పేర్కొన్నది. ఆ తర్వాత క్రమంగా బాధితుల సంఖ్య తగ్గుతుందని చెప్పింది. దీని ప్రకారం మే 22 నాటికి దేశంలో కరోనా కేసుల సంఖ్య 75వేల వరకు చేరుకుంటుందని అంచనా వేసింది. ప్రస్తుతం వివిధ వాతావరణ పరిస్థితుల్లో కరోనా వ్యాప్తి ఎలా ఉన్నది?, ఈ విపత్తును ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నది?, వైద్య సదుపాయాలు ఎలా ఉన్నాయి? వంటి అంశాల ఆధారంగా అధ్యయన బృందం మూడు నమూనాలను రూపొందించింది. వైరస్ వ్యాప్తిని అడ్డుకోవడానికి లాక్‌డౌన్‌ను మరికొన్ని రోజులపాటు కొనసాగించాలని అధ్యయనం సూచించింది. దేశంలో లాక్‌డౌన్ మే 3వ తేదీ వరకు కొనసాగనున్నది. ప్రస్తుతం వైరస్ పునరుత్పత్తి రేటు 0.8గా ఉన్నది. అంటే ఒక

కరోనా రోగి నుంచి 0.8 మందికి వ్యాధి వ్యాపిస్తున్నది. దీని ఆధారంగా రెండు అంచనాలను విడుదల చేశారు. లాక్‌డౌన్‌ను మే 15వరకు పొడిగిస్తే సెప్టెంబర్ 15వ తేదీ వరకు రోగులసంఖ్య సున్నాకు తగ్గుతుంది. ఒకవేళ లాక్‌డౌన్‌ను మే 30వరకు పొడిగించగలిగితే.. జూన్‌నెల మధ్యలోనే కేసులు సున్నాకు పడిపోతాయని పరిశోధకులు తేల్చారు. ఇటలీ, అమెరికా వంటి దేశాల్లో కరోనా వ్యాప్తి ఎలా ఉందో అధ్యయనం చేసి, వీటి ఆధారంగా భారత్‌లో వైరస్ ఎలా విస్తరిస్తుందో అంచనా వేస్తారు. చైనా, దక్షిణ కొరియా వంటి దేశాల్లో కరోనా వ్యాప్తి ప్రారంభం, పీక్‌స్టేజ్, కేసులసంఖ్య తగ్గుదలకు ఎంత సమయం పట్టిందో విశ్లేషిస్తారు. వాటిని భారత్‌కు అన్వయిస్తారు.వైరస్ పునరుత్పత్తి రేటు, ఒక్కో కరోనా రోగి సగటున ఎంతమందికి వైరస్‌ను వ్యాప్తి చేయగలడు? వంటివి సేకరిస్తారు.

భారత్‌లో కొనసాగుతున్న కరోనా తీవ్రత

భారత్‌లో కరోనా వైరస్ తీవ్రత కొనసాగుతూనే ఉంది. గడచిన 24గంటల్లో దేశంలో కొత్తగా 1409 పాజిటివ్ కేసులు నమోదవడంతోపాటు 41మరణాలు సంభవించాయి. దీంతో దేశంలో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 21,393కి చేరిందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఈ వైరస్ సోకి ఇప్పటి వరకు 681మంది మృత్యువాతపడ్డారు. మొత్తం బాధితుల్లో 4258మంది కోలుకున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం 16,454మంది చికిత్స పొందుతున్నారు. ఇప్పటివరకు కరోనా బారినపడి కోలుకుంటున్నవారి శాతం 19.36గా ఉందని ప్రభుత్వం తెలిపింది. గతకొన్ని రోజులలగా కరోనా నుంచి కోలుకుంటున్నవారి సంఖ్య పెరుగుతోంది. మహారాష్ట్రలో కరోనా వైరస్ తీవ్రత అంతకంతకూ పెరుగుతూనే ఉంది. రాష్ట్రంలో ఇప్పటివరకు ఈ వైరస్‌తో 269మంది మృత్యువాతపడ్డారు. మొత్తం బాధితుల సంఖ్య 5652కు చేరడం ఆందోళన కలిగిస్తోంది. ఇక గుజరాత్‌లోనూ కరోనా విజృంభణ కొనసాగుతోంది. ఇప్పటికే ఒక్కడ ఈ వైరస్ బారినపడి 103మంది ప్రాణాలు కోల్పోయారు. కేసుల సంఖ్య 2407కి చేరింది. మధ్యప్రదేశ్ లోనూ కరోనాతో 80మంది మరణించారు. దిల్లీలో కరోనా వైరస్‌తో మొత్తం 48మంది మరణించారు. కేసుల సంఖ్య 2248కు చేరింది. ఆంధ్రప్రదేశ్‌లో కరోనా వైరస్ తీవ్రత పెరుగుతూనే ఉంది. బుధవారం 60పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 821కి చేరింది. మరణాల సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో కరోనాతో 24మంది మరణించారు. ఇక తెలంగాణలో బుధవారం 15కేసులు నిర్ధారణ కాగా మొత్తం కేసుల సంఖ్య 943కి చేరింది. ఈ వైరస్ బారినపడి 23మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 194మంది కోలుకున్నారు.

కాంటాక్ట్ లేని వారిలోనూ కరోనా లక్షణాలు

కష్టంగా మారిని హిస్టరీ ఉన్నవారిని గుర్తించడం

న్యూఢిల్లీ,ఏప్రిల్23(ఆర్ఎన్ఎ): ఇప్పటి వరకు విదేశాల నుంచి వచ్చినవారు, మర్కజ్‌కు వెళ్లివచ్చిన వారి నుంచే కరోనా వైరస్ ఇతరులకు వ్యాపిస్తున్నట్లు భావించారు. కానీ ప్రస్తుతం ఏ కాంటాక్ట్ హిస్టరీ లేని వారిలోనూ వైరస్ వెలుగు చూస్తుం డటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. వీరిలో చాలా మందిలో కనీసం లక్షణాలు కూడా కన్పించకపోవడంతో ఎవరిలో వైరస్ ఉందో? ఎవరికి లేదో? గుర్తించడం కష్టమవు తోంది. ర్యాపిడ్ టెస్టులతో ఆశించిన ఫలితాలు రాకపోవడంతో ఐసీఎంఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం ఆ టెస్టులను కూడా నిలిపివేసింది. దీంతో పాజిటివ్ కేసులే కాదు.. వారికి సన్నిహితంగా మెలిగిన వారిని గుర్తించడం వైద్య ఆరోగ్యశాఖకు ఇబ్బందిగా మారింది. మరో రెండు రోజుల్లో రంజాన్ మాసం ప్రారంభం కాబోతోంది. మసీదుల్లో ప్రార్థనలకు అవకాశం లేకపోవడంతో కుటుంబ సభ్యులు, ఇతర బంధువులంతా ఒకేచోట చేరి సామూహిక ప్రార్థనలు చేసే అవకాశం లేకపోలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో చైన్ ఆఫ్ ట్రాన్స్‌మిషన్‌కు బ్రేక్ వేయడం ఎలా అనేది ప్రశ్నార్థకంగా మారింది. చైన్ ఆఫ్ ట్రాన్స్‌మిషన్ బ్రేక్ చర్యల్లో భాగంగా ఇప్పటికే ఎంపిక చేసిన కంటైన్మెంట్ జోన్లలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ప్రతి రోజూఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తోంది. ఇంట్లో ఎరికైనా దగ్గు, జలుబు, జ్వరం, మధుమేహం, హైపర్ టెన్షన్, కేన్సర్ వంటి ఇతర జబ్బులేమైనా ఉన్నాయా? అనే కోణంలో ఆరా తీస్తోంది. నిత్యావసరాలతో పాటు మందులు అందజేస్తోంది. ఎవరికైనా కరోనా అనుమానిత లక్షణాలు ఉన్నట్లు తేలితే వారిని వెం

లాక్‌డౌన్ లక్ష్యం దెబ్బతీస్తే మనకే నష్టం !

హైదరాబాద్, ఏప్రిల్ 23:లాక్‌డౌన్‌లో భారతదేశం నెలరోజులు గడపింది. నెలరోజులుగా అంతా బుద్ధిగానే ఇంటిఒట్టునే ఉంటున్నారు. కొందరు బరితెగించేవారు ఎప్పుడూ వీధుల్లో తిరగడానికి చేస్తున్న ప్రయత్నాలు కూడా ఉంటూనే ఉన్నాయి. మరోవైపు దేశ వ్యాప్తంగా కరోనా కేసులు పెరుగుతూనే ఉన్నాయి. ఓ పక్క కేంద్రం లాక్ డౌన్ పొడిగిస్తూ కరోనాను కట్టడి చేయాలనీ ఎంతగా ప్రయత్నం చేస్తున్నప్పటికీ దేశంలోని అన్ని రాష్ట్రాలలో వైరస్ కేసులు పెరుగుతూనే ఉన్నాయి. ఈ చైన్ తెగిపోతే తప్ప కరోనా కట్టడి కాదు. ఆ ప్రయత్నంలో ప్రభుత్వం ఉంది. ప్రజలు మాత్రం విచ్చలవిడిగా రోడ్డుపైకి వస్తూ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. ఇది ఎలాంటి విపరీత పరిణామాలకు దారితీస్తుందో అన్న ఆందోళనా ఉంది. ఈ దశలో మరో పక్షం రోజులు కఠిన దీక్షతో ఇంటికే పరిమితం అయితేనే కరోనా కట్టడికి తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తాయి. దీంతో అధికారులు,ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నిజానికి ఇప్పటి వరకు వెల్లడవుతున్న కేసులన్నీ కేవలం క్వారంటైన్‌లో ఉన్న వారివి,మర్కజ్ లింక్ ఉన్నవారివి, విదేశాల నుంచి వచ్చిన వారివి మాత్రమే. వీరిని మాత్రమే చెక్ చేయడం వల్ల బయటపడుతున్న కేసులగానే గుర్తించాలి. 130కోట్ల జనాభా ఉన్న దేశంలో మిగతా ప్రజల్లో ఎవరికి పాజిటివ్ ఉందో తెలియదు. ఈ దేశంలో ఎక్కడికి వెళ్లకుండా ఉన్న ప్రజలకు పాజిటివ్ ఉందా లేదా అన్నది తెలుసుకునే అవకాశం లేదు. అందువల్ల ప్రజలకు టెస్టు కిట్లు అందుబాటులోకి వస్తే తప్ప అసలు వ్యాప్తి ఎంతన్నది తెలియదు. కరోనా కట్టడికే ప్రాధాన్యం ఇస్తున్న ప్రస్తుత తరుణంలో లాక్‌డౌన్ కారణంగా ప్రపంచ దేశాలతో పోలిస్తే భారత దేశం బెటర్‌గా ఉంది. గడిచిన 24 గంటల్లో కొత్తగా 1,383 పాజిటివ్ కేసులు నమోదు అయినట్లు ఆరోగ్యశాఖ ప్రకటించింది. ఇప్పటివరకు 640 మంది కరోనా తో మరణించారని.. దేశవ్యాప్తంగా ఇప్పుడు కరోనా పాజిటివ్ కేసులు సంఖ్య 19,984కు చేరుకున్నట్లు తెలిపింది.భారత్‌లో ప్రస్తుతం 15,474 యాక్టివ్ కేసులు ఉండగా.. ఇప్పటి వరకు కరోనాబారిన పడి కోలుకుని ఆస్పత్రుల నుంచి డిశ్చార్జ్ అయినవారి సంఖ్య 3,870గా ఉంది. ఇకపోతే కరోనా కారణంగా మనమంతా ఓ మంచి సంస్కృతికి అలవాటు పడ్డాం.పరిసరాలు బాగు పడ్డాయి. వీధులు శుభ్రం అయ్యాయి. దోమలు చచ్చిపోయాయి. ఇళ్లల్లోకి దోమలు వస్తున్నాయనో లేదా దోమలకు పిచ్‌కారి చేయాలన్న అవకాశం లేకుండా పోయింది. కాలుష్యం తగ్గింది. ప్రతి చిన్న జబ్బుకు ఆస్పత్రులకు పరిగెత్తే అవకాశం లేకుండ ఆపోయింది. డాక్టర్ల కోసం వెంపర్లాడే ప్రమాదం తప్పింది. ఇకపోతే కరోనా సందర్భంగా, చేతులు కడుక్కోవడం వంటి అంశాలమీద జరిగినంతగా, ఆ జబ్బు మీద ఉన్న దురభిప్రాయాలను తొలగించడానికి ప్రచారం జరగడంలేదు. కరోనా సోకిన వారిని సమాజం వెలివేసిందన్న రీతిలో ప్రవర్తిస్తున్నారు. అందుకే చనిపోయిన వారిని అనాధశవాల్లాగా తరలిస్తున్నారు. జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి కానీ, కరోనా సోకినవారిని, వారి కుటుంబసభ్యులను, విదేశాల నుంచి వచ్చినవారిని వెలివేసినట్లు చూడనక్కరలేదు. కరోనా సోకుతుందేమోనన్న అనుమానంతోనే ఆత్మహత్యలు చేసుకుంటున్న ఘటనలు కూడా జరిగాయి.తొలిదశలో ఎయిడ్స్ వచ్చిన వారిని కూడా ప్రపంచంలో దూరం పెడుతూ వచ్చాం. వారిని అంటనరానివారిగా చూశాం. నిజానికి ఎయిడ్స్ అంటువ్యాధి కాదు. కానీ కరోనా మాత్రం ఖచ్చితంగా అంటువ్యాధి కనుక దూరం పాటించాల్సిందే. కానీ సామాజికంగా వెలివేయరాదు. ఈ కారణంగానే ఎవరు కూడా క్వారంటైన్‌లో ఉండడానికి ముందుకు రుఆవడం లేదు. తోటివారు తనను తక్కువగా చూస్తారన్న భావనతో ఉన్నారు. టెస్టులకు దొరక్కుండా అనుమానితులు తప్పించుకోవడానికి కూడా అదే కారణం. కరోనా గురించిన వాస్తవిక అంశాలను ప్రచారం చేయాలి. భయాందోళనలు తొలగించాలి. కరోనా పోరాటంలో సామాజిక నాయకుల సహాయం తీసుకోవాలి.ప్రజల సహకారంలేకపోతే, కరోనాతో చేసే యుద్ధంలో గెలుపు అసాధ్యం. లాక్‌డౌన్‌ను నిర్లక్ష్యం చేస్తే మరిన్ని రోజులు లాక్‌డౌన్ పొడించేందుకు ప్రభుత్వాలు వెనక్కపోవు. కేసులు పెరిగితే మళ్లీ లాక్‌డౌన్ పొడించడానికి పాలకులు వెనకాడరు. ఎందుకంటే ఇప్పుడున్న మందు ఇదొక్కటే. తమ కుటుంబసభ్యులో ఎవరికైనా కరోనా పాజిటివ్ వస్తే... చికిత్సకు వెళ్లవలసివస్తే అదేమంత పాపం కాదని, ఇతరులకు ఆ స్థితి వచ్చినా తాను వారిని గౌరవంగానే చూస్తానని ప్రతి ఒక్కరూ అనుకోవాలి. అట్లా అనుకుంటేనే వైద్యులకు, ప్రజలకు అందరికీ మంచిది. ఇకపోతే మర్కజ్ వెళ్లి వచ్చిన వారి ద్వారా ఎంతమందికి ఈ మహమ్మారి సోకిందో ఇంకా తేలవలసివుంది. ఈ వ్యాధి గురించిన అపోహలు ఎంతగా పెరిగాయంటే, ఆ వ్యాధిగ్రస్తుల్ని, వారి కుటుంబాలను, చివరికి వారికి చికిత్సనందించే వైద్య సిబ్బందిని వెలివేసినట్టు చూసే వాతావరణం దేశంలో అలుముకుంది. ఇదంతా వ్యాధిగ్రస్తుల్లో భయాందోళనలు సృష్టిస్తోంది. కనుకనే ఈ వ్యాధి బారిన పడినవారిలో కొందరు తమంత తాము బయటికొచ్చి చెప్పుకోవడానికి సందేహిస్తున్నారు. ఇది ప్రాణాలకు ముప్పు తెచ్చిపెడుతుంది. రోగి వెంటనే చికిత్స చేయించుకుంటే కోలుకోవడం చాలా సులభమని వైద్య నిపుణులు పదే పదే వివరిస్తున్నారు. తగిన జాగ్రత్తలు పాటిస్తే వ్యాధి సులభంగా తగ్గిపోతుందని కోలుకున్న వారు సైతం చెబుతున్నారు. అయినా వ్యాధిగ్రస్తుల్లో ఇంకా భయాందోళనలు, సందేహాలు పోవడం లేదు. వ్యాధిగ్రస్తులను వెలివేసే ధోరణి, వారిపట్ల లేనిపోని వదంతులు సృష్టించే వైఖరి అత్యంత ప్రమాదకరమైనది. ఇప్పటివరకూ రాజకీయాలు, కుల, మత, ప్రాంతీయ విభేదాలకు అతీ తంగా అందరూ ఒక్కటై కరోనా మహమ్మారిపై పోరాడారు. ఈ స్ఫూర్తిని ఇలాగే కొనసాగించాలి. అప్పుడే కంట్రోల్ చేయగలం.

ఇమ్మిగ్రేషన్ రద్దుపై ట్రంప్ ఎగ్జిక్యూటివ్ సంతకం

వాషింగ్టన్,ఏప్రిల్23(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్‌తో అమెరికా అల్లాడుతున్న క్రమంలో ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇమ్మిగ్రేషన్ రద్దుకు సంబంధించిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై ట్రంప్ సంతకం చేశారు. విదేశీయులు అమెరికాలోకి ఎవరూ రాకుండా చేయడంతోపాటు.. అమెరికాలో స్థిరపడి గ్రీన్‌కార్డుపై ఆశలు పెట్టుకున్న వారికి ఈ నిర్ణయం శరాఘాతంగా మారుతోంది. ఉన్నత విద్య, ఉద్యోగావ కాశాల కోసం ఎన్నో లక్షలమంది ప్రపంచ దేశాల నుంచి అమెరికాకు ప్రతియేటా వెళ్తూనే ఉన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వీటికి సంబంధించిన వీసాల జారీని నిలిపివేశారు. అలాగే అమెరికాలోనే స్థిరపడిన కొన్ని లక్షల మంది విదేశీయులు గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేశారు. వీరి ఆశలను కూడా అడియాశలు చేస్తూ.. గ్రీన్‌కార్డుల జారీని కూడా 60 రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు ట్రంప్ సర్కారు తేల్చిచెప్పింది. 60 రోజుల కాలపరిమితి ముగిశాక.. దీనిని పొడిగించాలా.. లేక సవరణలు చేయాలా అన్నది విశ్లేషిస్తామని ఇప్పటికే ట్రంప్ తెలిపారు.

అమెరికా యువత ఉద్యోగాలు కాపాడటమే తనకు ముఖ్యమని ట్రంప్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. అమెరికాలో ఇప్పటికే వేలాది మంది విదేశీయులు గ్రీన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో భారతీయుల సంఖ్య అధికంగా ఉంది. తాజా ఉత్తర్వులతో వీరి ఆశలపై నీరు చల్లినట్టయింది. ఇదిలా ఉండగా, తాజా ఆదేశాల నుంచి కొందరికి మినహాయింపు ఇచ్చినట్టు కనపడుతోంది. అమెరికాకు వెళ్లి వర్క్ చేయాలనుకుంటున్న వైద్యులకు ఈ ఆదేశాల నుంచి మినహాయింపు ఇచ్చారు. అదే విధంగా అమెరికా సిటిజన్‌షిప్ కలిగి ఉన్న వారి భార్య, భర్త, మైనర్ పిల్లలను కూడా తాజా ఆదేశాల నుంచి మినహాయించారు. ఈ ఏడాది అమెరికా ఎన్నికలు జరగనుండటంతోనే ట్రంప్ ఈ రకమైన ఆదేశాలను తీసుకొన్నన్నారంటూ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే ట్రంప్ ఆదేవాలతో భారతీయులకే ఎక్కువ నష్టమని అంటున్నారు.

మూడు నెలల వరకు అద్దె చెల్లించొద్దు

టిఆర్ఎస్ నాయకుడి ఉదారత

హైదరాబాద్,ఏప్రిల్23 (ఆంఎన్ఎ): అద్దెలు వసూలు చేయరాదన్న సిఎం కెసిఆర్ ఆదేశాలతో టిఆర్ఎస్ నాయకులు కొందరు ఉదారత చాటుకుంటున్నారు. అద్దెలను వాయిదా వేయడం లేదా రద్దు చేస్తున్నారు.

కరోనా లాక్‌డౌన్ నేపథ్యంలో పేదల జీవితాలు రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితులు ఏర్పాడ్డాయి. గత నెల రోజులుగా ప్రభుత్వం విధించిన లాక్‌డౌన్ కారణంతో ఎవరూ పనులు చేసుకోలేక ఇంటికే పరిమితమయ్యారు. అయితే నెల రోజులుగా పని చేయకపోవడంతో ఇంటి అద్దె, నిత్యావసరాలకు ఇబ్బందులుగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్ ఇంటి అద్దె విషయంలో ఇళ్ల యజమానులు కిరాయిదార్లను ఇబ్బందులు పెట్టొద్దని కోరారు. హైదర్‌నగర్ డివిజన్ టీఆర్ఎస్ గౌరవ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డికి తులసినగర్‌లో సొంత ఇల్లు ఉంది. అందులో 10 పేద కుటుంబాలు నివసిస్తున్నాయి. వారి పరిస్థితి తెలిసిన దామోదర్‌రెడ్డి మూడు నెలల వరకు అద్దె చల్లించాల్సిన అవసరం లేదన్నారు. దీంతో ఆ పది కుటుంబాలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపాయి. అలాగే వారికి అవసరమైన సాయం కూడా అందిస్తామని అన్నారు.

సిఎం జగన్‌కు సొంత అజెండా తప్ప మరోటి లేదు

మాజీమంత్రి కామినేని మండిపాటు

అమరావతి,ఏప్రిల్23(ఆర్ఎన్ఎ): సిఎం వైఎస్ జగన్ సొంత ఎజెండాతో పోతున్నారే తప్ప ప్రజల అవసరాలు గుర్తించడం లేదని బీజేపీ నేత, మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావు అన్నారు.రాష్ట్రంలో కరోనా వైరస్ నేపథ్యంలో స్థానిక ఎన్నికలు వాయిదా వేసిన నిమ్మగడ్డ రమేష్ కుమార్‌ను ఎలా తప్పించాలి?.. కొత్త ఎస్ఈసీని మద్రాస్ నుంచి ఎలా తీసుకురావాలి?.. ఎన్నికలు ఎలా జరిపించాలన్న ఆలోచనలే సీఎం జగన్ చేశారని కామినేని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి 50 శాతం ఓట్లతో 151 మంది ఎమ్మెల్యేలను గెలిపించారని కామినేని అన్నారు. గురువారం ఆయనమాట్లాడుతూ సీఎం జగన్ మాత్రం ప్రజలకు ఏం కావాలి, వాళ్ల అవసరాలు ఏంటనేది చూడకుండా సొంత ఎజెండాతో, ఎవరితో మాట్లడకుండా, సూచనలు, సలహాలు తీసుకోకుండా ముందుకు వెళుతున్నారని ఆరోపించారు.

పాల్ఘార్ ఘటనలో సాధువులను చంపిందెవరు?

దీనివెనక కుట్ర కోణం ఉందా అన్న అనుమానాలు
మూకదాడిపై విచారణకు ఆదేశించిన మహా సర్కార్

ముంబై,ఏప్రిల్23(ఆర్ఎన్ఎ): మహారాష్ట్రలో ఇటీవల ఇద్దరు సాధువుల మూకదాడి హత్యోదంతం రగులుతోంది. ఈ ఘటనపై ఆ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సిఐడికి అప్పగించింది. అయితే పోలీసుల సమక్షం లోనే మూకదాడి జరగడం, అక్కడున్న పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడంపై తీవ్ర విమర్శలు చెలరేగాయి. దీనిపై పెద్దగా ఎవరూ స్పందించకపోవడం కూడా అనుమానాలకు తావిస్తోంది. ఇది యాదృచ్ఛికంగా జరిగింది కాదన్న వాదనా ఉంది. కావాలనే కొందరు రెచ్చగొట్టి సాధువులను హత్య చేయించారన్న అనుమానాలు ఉన్నాయి. మహారాష్ట్రలోని పాల్ఘర్‌లో గతవారం ఇద్దరు సాధువులను, వారి డ్రైవర్‌ను ఒక గుంపు కొట్టి చంపిన ఉదంతం చుట్టూ రకరకాల కథనాలు ప్రచారంలోకొస్తున్నాయి.దాడికి దిగిన ఆదివాసీ గ్రామస్తులు కొన్ని వదంతులను విశ్వసించి, ఆ సాధువులను దొంగల ముఠాకు చెందిన వారిగా అనుమానించి, ఆవేశంతో ఈ దురాగతానికి పాల్పడ్డారని ప్రభుత్వం చెబుతోంది. ఈ ఉదంతం నిజానిజాలు మరికొన్ని రోజుల్లో విచారణలో బయటికొస్తాయంటోంది. పాల్ఘర్ ఉదంతంలో ప్రాణాలు కోల్పోయిన సాధువులిద్దరిలో ఒకరు 70 ఏళ్లవారైతే, మరొకరు 35 ఏళ్ల వ్యక్తి. వీరిద్దరూ జునా అఖాడాకుచెందిన సాధువులు. ఎనిమిదో శతాబ్దంలో హిందూ మత పరిరక్షణ కోసం ఆది శంకరాచార్యులు నెలకొల్పిన ఏడు అఖాడాలు అనంతర కాలంలో 13కి చేరుకున్నాయి. ఈ అఖాడాల్లో వారణాసి కేంద్రంగా పనిచేస్తున్న జునా అఖాడా ఉన్నతమైనదని చెబుతారు. సూరత్‌లో తమ గురువు శ్రీ మహంత్ రామ్‌గిరి అంత్యక్రియల్లో పాల్గొనడానికి వెళ్తున్న సాధువులను లాక్‌డౌన్ కారణంగా అనుమతించ లేమని దాద్రా నాగర్ హవేలీ వద్ద స్థానిక పోలీసులు ఆపి, వెనక్కు పంపించారు. అలా వెళ్తుండగా గుంపు దాడికి దిగింది. సాధువులపై ఉన్మాద గుంపు చేసిన దాడికి సంబంధించిన వీడియో గమనిస్తే ఇద్దరు కానిస్టేబుళ్లు నెత్తురోడుతున్న వృద్ధ సాధువును, మరో ఇద్దరినీ ఆ ఉన్మాదులకు అప్పగించినట్టు అర్థమవుతుంది. కర్రలతో, కత్తులతో, గొడ్డళ్లతో వారిపై దాడి చేస్తుంటే కానిస్టేబుళు నిర్లిప్తంగా ఉండి పోయారు. అంతమంది గుంపును ఒకరో, ఇద్దరో నియంత్రించడం అసాధ్యమే. కానీ కనీసం పై అధికారులకు ఫోన్ చేసి పరిస్థితిని వివరించి, అదనపు బలగాలు రప్పించి వారి ప్రాణాలు కాపాడే ప్రయత్నం చేయలేదు. కొన్ని రోజులక్రితం ఇంటింటికీ ఆహారధాన్యాలు పంపిణీ చేసి, ఆదివాసీలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి తిరిగివస్తున్న వైద్యుడి కారుపై సైతం దాదాపు 250మంది వేరే గ్రామంలో ఇదే మాదిరి దాడి చేశారు. అప్పుడు కూడా కారులో వెళ్తున్నవారు దొంగలన్న అనుమానంతోనే గుంపు దాడికి దిగింది. వీటన్నిటిపైనా ప్రభుత్వాన్ని నిలదీయడం, దాడులకు కారకులెవరో, వారిని ప్రేరేపించినవారెవరో వెలికి తీయాలని సర్వత్రా డిమాండ్ చేస్తూనే ఉన్నారు. మరణించిన సాధువులు అఖాడాకు చెందినవారు గనుక, దాడి చేసిన వారు అన్యమతస్తులైవుంటారని అనుమానాలు బలపడ్డాయి. దాడి జరిగిన ప్రాంతం సీపీఎం శాసనసభ్యుడు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం పరిధిలోనిది. కనుక దాడి వెనక ఆ పార్టీ హస్తం వుందని మరికొందరు ఆరోపిస్తున్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఈ కేసులో అరెస్టయిన నిందితుల పేర్లను కూడా వెల్లడించింది.

కరోనాతో వసలదారులకు ఇక్కట్లు

వెల్లడించిన ప్రపంచ బ్యాంక్

వాషింగ్టన్,ఏప్రిల్23(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి వల్ల ప్రపంచ వ్యాప్తంగా విధించిన లాక్‌డౌన్‌తో సౌత్ ఏషియాలోని ఇంటర్నేషనల్, ఇంటర్నల్ వలసదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని వరల్డ్ బ్యాంక్ పేర్కొంది. వాళ్లందర్నీ ఆరోగ్య సేవలు, నగదు బదిలీ లాంటి సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేసి ఆదుకోవాలని ప్రభుత్వాలను సూచించింది. కొన్ని దేశాల్లో వైరస్ ముందే వ్యాప్తి చెందటంతో అప్రమత్తమైన కొంత మంది ట్రావెల్ బ్యాన్ విధించకముందే సొంత దేశాలకు తిరిగి వచ్చారని, కొంత మందిని ఆయా దేశాలు స్పెషల్ రిక్వెస్ట్ పైన రప్పించారని చెప్పింది. ఈ ఏడాది వలస వెళ్లే వారి సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశం ఉందని వరల్డ్ బ్యాంక్ రిపోర్ట్ చెప్తోంది. కరోనా మహమ్మారిని అరికట్టేందుకు మన దేశంలో విధించిన లాక్‌డౌన్ దాదాపు 40 మిలియన్ల ఇంటర్నల్ మైగ్రెంట్స్‌పై ప్రభావం చూపిందని వరల్డ్ బ్యాంక్ చెప్పింది. దీంతో 50నుంచి 60 వేల మంది తమ సొంత వూళ్లకు తిరిగి వెళ్లిపోయారని నివేదిక ఇచ్చింది. లాక్‌డౌన్ వల్ల ఉద్యోగాలు కోల్పోయి, సోషల్ డిస్టెంసింగ్ పాటించలేక పోవడం వల్ల మన దేశం, లాటిన్ అమెరికాలోని చాలా మంది అంతర్గత వలసదారులు భారీగా తిరిగి సొంతూళ్లకు వెళ్లిపోయారని చెప్పింది. ఇప్పటికే అక్కడికి వెళ్లిన వారు మాత్రం ఇప్పట్లో తిరిగొచ్చే అవకాశాలు లేవని, ట్రావెల్ బ్యాన్ వల్ల వాళ్లంతా ఎక్కడి వాళు అక్కడే ఇరుక్కుపోయే అవకాశాలు ఉన్నాయంది. వలసదారులకు మద్దతు ఇచ్చేందుకు ప్రభుత్వాలు స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక చర్యల తీసుకోవాలని, వారికి ఆదాయాన్ని కోల్పోకుండా కార్మికులకు ఉద్యోగాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని వరల్డ్ బ్యాంక్ సూచించింది.

ఉమ్మడి జిల్లాలో ఎర్రబెల్లి సుడిగాలి పర్యటనలు

రోజూ ఓ ప్రాంతంలో పర్యటిస్తూ ప్రజల్లో భరోసా
కరోనా హెచ్చరికలతో జాగ్రత్తగా ఉండాలిన సూచనలు
ధాన్యం కొనుగోళ్ల పరిశీలన చేస్తూ అండగా ఉన్నామని హామీ

మహబూబాబాద్,ఏప్రిల్23(ఆర్ఎన్ఎ): గత వారం పదిరోజులుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుడిగాలి పర్యటన చేస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కరోనా కట్టడి, ధాన్యం కొనుగోళ్లపై దృష్టి సారించారు. ఓ వైపు కరోనాపై ప్రజలను అప్రమత్తం చేస్తూనే, ధాన్యం కొనుగోళ్లపై రైతులకు అండగా ఉంటున్నారు. ఎక్కడా సమస్యలు రాకుండా అధికారులతో సమన్వయం చేస్తున్నారు. ఎండను లెక్క చేయకుండా అధికారులతో కలసి పర్యటిస్తున్నారు. ప్రస్తుతం కరోనా వైరస్ విస్తరిస్తున్నందున ఆ వైరస్‌ని కట్టడి చేయడానికి ప్రజలంతా ప్రభుత్వానికి సహకరించాలని చెప్పారు. లాక్‌డౌన్‌ని పాటించాలని, సీఎం కేసీఆర్ చెప్పినట్లుగా నడుచుకోవాలని చెప్పారు. ప్రజలు వైద్యులకు, అధికారులు, పోలీసులు, పారిశుద్ధ్య కార్మికులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, సామాజిక. భౌతిక దూరాన్ని పాటిస్తూ, స్వీయ నియంత్రణలో ఉండాలని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల ఆత్మ బంధువు. ఆయనలా రైతులకు మేలు చేస్తున్న సీఎంలు దేశంలో ఎక్కడా కూడా లేరని ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు. అన్నదాతను నిజంగా ఆదుకుంటున్న రైతు బంధువు సీఎం కేసీఆర్ అని కొనియాడారు. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం పోచారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి, రైతులనుద్దేశించి మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతాంగానికి అవసరమైన సాగు నీటిని అందిస్తున్నారు. 24 గంటల పాటు కోతల్లేని, నాణ్యమైన కరెంటుని అందిస్తున్నారు. పంటలకు పెట్టుబడులను రైతుబంధు పేరుతో అందిస్తున్నారు. రైతులకు విత్తనాలు, ఎరువులను సకాలంలో అందుబాటులో ఉంచుతున్నారు. కల్తీలేని విత్తనాలు అందేలా చూస్తున్నారు. రైతుల పంటలు నష్టపోతే పరిహారం ఇస్తున్నారు. రైతులకు ఉచితంగా బీమా చేసి, ఒకవేళ చనిపోతే వాళ్ళ ఇళ్ళకే ఆ బీమా డబ్బులు అందేలా చూస్తున్నారు. చివరకు రైతులు పండించిన పంటలను కూడా ఆఖరి గింజ వరకూ, కనీస మద్దతు ధర దేశంలో ఎక్కడా లేని విధంగా చెల్లిస్తూ, కొనుగోలు చేస్తున్నారు. వడ్డీలేని రుణాలు ఇస్తున్నారు. ఇంతగా రైతుల కోసం పని చేస్తున్న ముఖ్యమంత్రులు దేశంలోనే కాదు, ప్రపంచంలో కూడా ఎక్కడా లేరని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు రైతులకు వివరించారు. కరోనా కష్టకాలంలోనూ రైతుల ధాన్యం కొనుగోలు కోసం రూ.30వేల కోట్లను కేటాయించారని, మక్కల కొనుగోలు కోసం రూ3వేల కోట్లను కేటాయించారని మంత్రి ఎర్రబెల్లి రైతులకు చెప్పారు. రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ ప్రమాణాలకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలకు శుద్ధి చేసి తేవాలని మంత్రి ఎర్రబెల్లి రైతులకు సూచించారు. అలాగే రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు. ఇక ఉపాధి కూలీల పనులను పర్యవేక్షిస్తూ నేనే మీ మంత్రిని... అంతా బాగేనా? పనులు ఎట్ల జరుగుతున్నయి? కాలువ పని చేస్తున్నరా? మంచి పనే పెట్టుకున్నరు. భవిష్యత్తులో ఉపయోగ పడే పనులే పెట్టుకోండి. ఇంకాస్త దూరం పాటించండి. కరోనా ఉంది జర జాగ్రత్త. లాక్ డౌన్ ని పాటిద్దాం. సిఎం కెసిఆర్ చెప్పినట్లు విందాం. కరోనా పోయేదాకా జాగ్రత్తగా ఉందాం అని మంత్రి ఎర్రబెల్లి ఉపాధి హామీ కూలీలతో మమేకమై ముందుకు సాగారు. వరంగల్ రూరల్ జిల్లా, మహబూబాబాద్ జిల్లాల్లో విస్తరించి ఉన్న తన నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం, నిరుపేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ వంట పలు కార్యక్రమాల్లో పాల్గొనడానికి వెళుతున్న మంత్రి దారిలో మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండలం కిష్టతండాలో కాలువ శుభ్రం చేసే పనులు జరుగుతుండగా చూశారు. వెంటనే అక్కడ మంత్రి ఆగారు. నేరుగా పొలాల గట్ల మీద నుంచి నడుస్తూ, కాలువ వద్దకు చేరుకుని కూలీలను పలుకరించారు. అక్కడ జరుగుతున్న పనులు ఉపాధి హామీ పనులని తెలుసుకున్నారు. ఇక అంతే, నేరుగా కూలీలతో మాట్లాడటం మొదలు పెట్టారు. నేను ఎవరో తెలుసా... మీ మంత్రిని నేనే... పనులు మంచిగ జరుగుతున్నయా? కూలీ ఎంత పడుతుంది? సరిపోతాందా? అంటూ ప్రశ్నించారు. ఆ సారు మాకు తెలుసు... మీరే మా మంత్రి. మంచిగనే ఉంది సారు అని వాళ్ళు చెప్పారు. మరి ఈ కాలువ ఎంత దూరం ఉంటుంది? అంత దూరం పని చేస్తున్నరా? అని అడిగారు. అవుననగానే... మంచి పనే పెట్టుకున్నరు. ఉపయోగపడే పనులే చేయండి అని ఉపాధి హామీ కూలీలకు మంత్రి ఎర్రబెల్లి సూచించారు. ఆ వెంటనే కరోనా ఉన్నది తెలుసా? అని అడిగారు. తెలుసనగానే, జర భద్రంగా ఉండండి. లాక్ డౌన్ పాటిస్తున్నరా? అని మంత్రి ఎర్రబెల్లి అడిగారు. పాటిస్తున్నం సర్. దూరం దూరం కూడా ఉంటున్నం అని వారు చెప్పారు. ఇంకా దూరంగా ఉండండి. కరోనా పోయేదాకా, సీఎం కెసిఆర్ చెప్పినట్లు చేద్దాం. లాక్ డౌన్ ని పాటిద్దాం. అని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఉపాధి హామీ కూలీలకు చెప్పారు. మంత్రి నేరుగా ఉపాధి హామీ కూలీలతో ముచ్చటించడంతో... ఆ కూలీల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. పైగా, ఎల్లప్పుడూ తమకు అందుబాటులో ఉండే మంత్రి దయన్న, మరోసారి తమ వద్దకే రావడం, యోగ క్షేమాలు అడగటంతో ఉపాధి హామీ కూలీలు ఉత్సాహంగా పని చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది కలగొద్దు: మంత్రి పువ్వాడ

ఖమ్మం, ఏప్రిల్ 23:: మధిర నియోజకవర్గంలోని ముష్టికుంట, బోనకల్‌లో ఏర్పాటు చేసిన వరిధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని రవాణా శాఖమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని, ఎండల నేపథ్యంలో వారికి వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం బోనకల్-వత్సవాయి రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును పరిశీలించారు. అక్కడ సేవలందిస్తున్న వలంటీర్స్‌కు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.

యూపికి కాలినడకన బయలుదేరిన యువకులను అడ్డుకున్న ప్రకాశం పోలీసులు

-జిల్లాలో క్వారంటైన్‌కు తరలింపు

ఒంగోలు,ఏప్రిల్23(ఆర్ఎన్ఎ): ఊహించని ఉపద్రవం కరోనా మహమ్మారి రూపంలో చుట్టుముట్టడంతో సామాన్యుల బతుకులు అగమ్యగోచరమయ్యాయి. వలస కూలీలు, చిన్నా చితకా పనులు చేసుకునేవారు, చిరు వ్యాపారులు కష్టాల్లో కూరుకుపోయారు. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ఎంత చేస్తున్నా, అందరికీ సాయం అందడం అసాధ్యమవుతున్నది. బతుకు దెరువు కోసం ఉత్తరప్రదేశ్‌కు చెందిన పది మంది యువకులు చిత్తూరులో పనిచేసుకుంటున్నారు. కరోనా నేపథ్యంలో పనులు లేకపోవడంతో వీరంతా సొ÷-తూరు బయలుదేరారు. అయితే మధ్యలో వీరిని ప్రకాశం జిల్లాలో పోలీసులు నిలువరించారు. చిత్తూరులో ఇక్కడ ఐస్ బండ్లు నడుపుకుంటూ రెండేళ్లుగా జీవనం సాగిస్తున్నారు. అందరి వయస్సు 20 ఏళ్లలోపే కావడంతో వీరి బతుకుల్లో కరోన అలజడి రేపింది. లాక్‌డౌన్‌తో ఇప్పట్లో వ్యాపారాలకు అనుమతులు ఇచ్చే అవకాశం లేదని యజమానులు చెప్పడంతో ఎలాగైనా సొంతూళ్లకు చేరాలనుకున్నారు. వాహన సదుపాయాలు అందుబాటులో లేక కాలినడకన వెళ్లాలని నిర్ణయించుకున్నారు. చిత్తూరు నుంచి ఉత్తరప్రదేశ్ చేరుకోవాలంటే మొత్తం 1900 కిలోమీటర్లు ప్రయాణించాలి. ఆదివారం సాయంత్రం చిత్తూరు నుంచి బయల్దేరారు. మార్గమధ్యలో కనీసం భోజనం చేసే పరిస్థితులు కూడా లేకపోవడంతో ఎవరైనా భోజనం ప్యాకెట్లు పంపిణీ చేస్తుంటే వాటిని తీసుకుంటూ మొత్తంగా మూడు రోజుల్లో 331 కిలోమీటర్లు అంటే సరా

నాణ్యతతో ధాన్యం తీసుకుని రావాలి

రైతులకు దీనిపై అవగాహన కల్పించాలి
ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందు రావద్దు
కలెక్టర్లు సూచించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

జనగామ,ఏప్రిల్23(ఆర్ఎన్ఎ): కరోనా కష్ట కాలంలో రైతాంగం నుంచి కొనుగోలు చేస్తన్న ధాన్యం నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సూచించారు. రైతులకు ముందుగానే వారు తేవాల్సిన ధాన్యం నాణ్యతపై అవగాహన కల్పించాలన్నారు. తాలు లేకుండా చూసుకోండి. తూనికల్లో అవకతవకలకు తావీయవద్దు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతుకు ఇబ్బందులు రాకుండా చూడాలని ఎర్రబెల్లి దయాకర్ రావు ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ తదితర ఎమ్మెల్యేలతో కలిసి మంత్రి జనగామ, వరంగల్ రూరల్ జిల్లా కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 4లక్షల 81వేల 345 ఎకరాల్లో ధాన్యం పండించగా, 11లక్షల 68వేల 389 మెట్రిక్ టన్నుల దిగుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. మొత్తం 895 కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించామన్నారు. అయితే ఇప్పటి వరకు 566 కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని, మిగతా కొనుగోలు కేంద్రాలను సాధ్యమైనంత వేగంగా ప్రారంభించాలని సూచించారు. అత్యధికంగా 188 కొనుగోలు కేంద్రాలకు 186 కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయయని తెలిపారు. వరంగల్ రూరల్ జిల్లాలో 117కి 35, భూపాలపల్లి జిల్లాలో 182కి 15 కేంద్రాలు మాత్రమే ప్రారంభమయ్యాయన్నారు. అయితే, ఆ రెండు జిల్లాల్లో పంటలు ఆలస్యంగా వేశారని, దిగుబడులు కొద్ది ఆలస్యంగా వస్తాయని ఆలోగా, మిగతా కేంద్రాలు మొదలు పెట్టాలని చెప్పారు. జనగామలో 186 సెంటర్లు ప్రారంభం కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 182 సెంటర్లు పని చేస్తున్నాయి. మిగతా 4 సెంటర్లు త్వరలో పని చేసేలా చూడాలి. గన్నీ బ్యాగుల కొరత ఉందని రైతులు అంటున్నారు. మొత్తం 21 లక్షల గన్నీ బ్యాగుల్లో ఇంకా ఆరు లక్షల గన్నీ బ్యాగులు రావాల్సి ఉంది. కాబట్టి వాటిని వెంటనే తెప్పించాలని మంత్రి జనగామ జిల్లా కలెక్టర్ నిఖిలకు సూచించారు. మిల్లర్ల నుంచి కూడా గన్నీ బ్యాగులు తీసుకోవాలని మంత్రి సూచించారు. గోదాములను ప్రస్తుత దిగుబడి 2లక్షల 75వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిలువకు సరిపడా ముందే సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఇక వరంగల్ రూరల్ జిల్లాలోనూ 86వేల 780 ఎకరాల్లో 2 లక్షల 8వేల 186 మెట్రిక్ టన్నుల దాన్యం దిగుబడులు వస్తాయని భావిస్తున్నామన్నారు. 117 సెంటర్లకు కేవలం 35 సెంటర్లు మాత్రమే ప్రారంభమయ్యాయని, మిగతా సెంటర్లను సాధ్యమైనంత తొందరలో ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ హరితను మంత్రి ఆదేశించారు. గన్నీ బ్యాగులు కొరత ఉందని రైతులు అంటున్నారని, ఆ పరిస్థితిని అధిగమించాలని సూచించారు. రైతులకు ధాన్యం నాణ్యతా ప్రమాణాల మీద అవగాహన కల్పించాలని మంత్రి చెప్పారు. తాలు రాకుండా చూసుకోవాలని కలెక్టర్లకు చెప్పారు. అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి, పర్యవేక్షించాలని మంత్రి ఎర్రబెల్లి ఆదేశించారు.

రైతులను అన్నివిధాలా ఆదుకోవాలి

-సిఎం కెసిఆర్‌కు దాసోజు లేఖ

హైదరాబాద్,ఏప్రిల్23(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో రబీలో సాగైన పంటలు, ప్రభుత్వ కొనుగోళ్ల పరిస్థితి, రైతులను ఆదుకునే విషయంలో ప్రభుత్వం తగిన విధంగా స్పందించాలని కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధికార ప్రతినిధి దాసోజు శ్రావణ్‌కుమార్ డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వం చెప్పిన మేరకు పనులు జరగడం లేదన్నారు. ఈసందర్భంగా ఆయన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఒక బహిరంగ లేఖ రాస్తూ మే 7వ తేదీ వరకూ తెలంగాణలో లాక్‌డౌన్‌ను పొడిగించాలన్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. కరోనా మహమ్మారి నుంచి ప్రజలను రక్షించేందుకు ప్రభుత్వ ప్రయత్నానికి తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందన్నారు. కానీ లాక్‌డౌన్ పొడిగింపు వల్ల తెలంగాణ ఆర్థిక పరిస్థితి పూర్తిగా ఛిద్రమయ్యే ప్రమాదం ఉందన్నారు. అంతేకాకుండా అన్నదాత రైతన్న మరీ ప్రమాదంలో పడ్డాడని, వారిని ఆదుకునేందుకు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. మార్చి, ఏప్రిల్ నెలలు వ్యవసాయ పంటల కోతల సమయం. లక్షలాది మంది రైతు కుటుంబాల జీవితాలు ఈ పంటలపై వచ్చే ఆదాయాలపై ఆధారపడి ఉంటాయి. తెలంగాణ ప్రభుత్వం ప్రతి ధాన్యంపు గింజను కొనుగోలుచేస్తామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అనేక లోటుపాట్లు ఉన్నాయన్నారు. అందుకే సామాజిక బాధ్యతతో కొనుగోలు కేంద్రాల వద్ద రైతాంగం ఎదుర్కొంటున్నసమస్యలను పరిష్కరించి వారిని ఆదుకోవాలని విజ్ఞప్తిచేశారు. ఈ రబీ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 53.68 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. రబీ సాధారణ విస్తీర్ణం 31.58 లక్షల ఎకరాలుకాగా ఈసీజన్‌లో 70శాతం అదనంగా విస్తీర్ణంలో పంటలు సాగయినట్టు వ్యవసాయశాఖ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ప్రధానంగా వరి 39.24 లక్షల ఎకరాలు, మొక్కజొన్న 6.21 లక్షల ఎకరాలు, శనగ 3.28 లక్షల ఎకరాలు, వేరుశనగ 2.30 లక్ష ఎకరాల విస్తీర్ణంలో సాగయ్యాయని తెలిపారు. కందుల కొనుగోళ్లు రాష్ట్రంలో నిలిపి వేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన క్వింటాలుకు 5,600 కనీస మద్దతు ధరతో 1.40 లక్షల మెట్రిక్‌టన్నుల కొనుగోలు చేశారు. కందులను కూడా ప్రభుత్వమే గిట్టుబాటు ధరలు ఇచ్చి కొనుగోలు చేయాలని దాసోజు డిమాండ్ చేశారు. ఇక బత్తాయి, మామిడి లాంటి పండ్ల తోటల

ఉత్పత్తులను ప్రభుత్వం మద్దతు ధరలు ఇచ్చి కొనుగోలు లేదా మార్కెట్‌లో మంచి ధరలు ఉన్న ప్రాంతాల్లో రైతులు, వారి ఉత్పత్తులను అమ్ముకునేలా సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ ప్రత్యేక ఆసాధారణ పరిస్థితులలో ప్రభుత్వం కూడా అదేస్థాయిలో స్పందించి అన్నదాతను అన్ని విధాలుగా ఆదుకోవాలని విజ్ఞప్తిచేశారు.

"హర్ ఘర్ చుప్ చాప్ సే కహతా హై' ను మళ్లీ తీసుకువచ్చిన ఏషియన్ పెయింట్స్

హైదరాబాద్, ఏప్రిల్23 ప్రస్తుత అనిశ్చితి సమయాల్లో నవ్వుకునేందుకు మరియు మనం చేస్తున్న పను లకు మనల్ని మనం మెచ్చుకునేందుకు తన ఐకానిక్ 2007 యాడ్ ఫిల్మ్ "హర్ ఘర్ చుప్ చాప్ సే క హతా హై' ను ఏషియన్ పెయింట్స్ మళ్లీ తీసుకువచ్చింది. ప్రజాదరణ పొందిన ఈ టీవీసీ తన వీక్షకుల్లో ఎన్నో భావోద్వే గాలను రగిల్చింది. నూతన 50 సెకన్ల డిజిటల్ ఫిల్మ్ తో అలాంటి భావనలను తిరిగి కలిగించాలన్నదే దీని ల క్ష్యం. సృజనాత్మక మేధావి పీయూష్ పాండే దీన్ని రూపొందించారు. ప్రస్తుత క్వారంటైన్ సమయంలో ప్రతీ ఒక్క రూ ఇంట్లో ఉంటున్న నేపథ్యంలో, నేటి పరిస్థితులకు మరింత తగినట్లుగా ఉండే రీతిలో షాట్స్ మాంటేజ్ తో ఏం తో అందంగా ఇది రూపుదిద్దుకుంది. ఈ డిజిటల్ ఫిల్మ్ దేశవ్యాప్తంగా కూడా వినియోగదారులతో బాగా అనుసం ధానమైంది. 80 లక్షలకు పైగా వీక్షణలు పొందింది. 6 లక్షలకు పైగా కామెంట్స్, లైక్స్, షేర్స్ వచ్చాయి. నేడు మనం ఎదుర్కొంటున్న సవాళ్ల మధ్య, ఈ క్వారంటైన్ లో ప్రజలంతా ఇంట్లోనే ఉండేందుకు, సురక్షితంగా ఉండేందుకు స్ఫూర్తినిస్తోంది ఏషియన్ పెయింట్స్. ప్రస్తుత పరిస్థితుల్లో రోజువారీ జీవనాన్ని కొనసాగిస్తున్న ప జల జీవితానికి ఇది అద్దంపడుతుంది. ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించేందుకు సర్వస్వాన్ని దానికి అందిస్తున్న కా ర్పొరేట్ హీరోలు కావచ్చు లేదంటే భార్యకు సహాయం చేసేందుకు మొదటి సారిగా వంట చేస్తూ చేతులు కాల్చు కుంటున్న మేనేజర్ కావచ్చు; ఈ సమయంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక సహాయం చేసే వారే. అలాంటి సంద ర్భాలు కుటుంబ అనుబంధాలను కనుగొనేందుకు వేదికలుగా మారుతాయి. పాతవాటిని గుర్తుకు తెస్తాయి. కొత్త వాటిని ఏర్పరుస్తాయి. ఈ విలువైన అనుభూతులు ఇంట్లో నాలుగు గోడల మధ్యనే బోటు చేసుకుంటూ ఉంటా యి, ఇప్పుడు అత్యంత సురక్షితమైంది ఇల్లు మాత్రమే. ఈ నూతన డిజిటల్ యాడ్ గురించి ఏషియన్ పెయింట్స్ ఎండీ, సీఈఓ అమిత్ సింగ్లే మాట్లాడుతూ, "ఈ ఫిల్మ్ తీయడంలో ఉద్దేశం తమ జీవితాల్లో ఇంటితో గల పటిష్ఠ అనుబంధాన్ని ప్రజలు అనుభూతి చెందేలా చేయడమే. నిజమైన హోమ్ వీడియోస్ తో ఈ బ్రాండ్ ప్రజలకు స్ఫూర్తినిస్తోంది. దేశమంతటా ప్రజలు తమ ఇళ్లలో తమ సొం త స్పెషల్ మూమెంట్స్ ను ఎలా క్రియేట్ చేస్తున్నారో మరియు ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఆశను, చిరునవ్వు లను ఎలా తీసుకువస్తున్నారో తెలియజేస్తుంది. ఇంట్లో ఉండండి. సురక్షితంగా ఉండండి" అని అన్నారు.

ఏపీఐలు, కేఎస్ఎంల దేశీయ తయారీ ప్రమోషన్ విధానానికి
సంబంధించి ఐపీఏ ప్రెస్ స్టేట్ మెంట్

హైదరాబాద్, ఏప్రిల్ 23: రూపంలో భారతదేశం ఊహించని అంతర్జాతీయ ఆరోగ్య ముప్పును ఎదుర్కొంటోంది. ఊహించని ఈ సవాలు నేపథ్యంలో ఇండియన్ ఫార్మాస్యూటికల్ అలియెన్స్ (ఐపీఏ), దాని సభ్యత్వ కంపెనీలు భారత దేశంలోని రోగులు అందుబాటు ధరల్లో, నాణ్యమైన ఔషధాలు పొందేందుకు గాను సరఫరా వ్యవస్థ లోని కీలక పాత్రధారులు, ఇతర ఫార్మా పరిశ్రమ అసోసియేషన్లు, భారత ప్రభుత్వంతో కలసి పని చేస్తున్నాయి.

ముఖ్యమైన కీ స్టార్టింగ్ మెటీరియల్స్ (కేఎస్ఎం) ఇంటర్మీడియేట్స్ మరియు యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడియెంట్స్ (ఏపీఐ) లను దేశంలోనే తయారు చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఐపీఏ స్వాగతిస్తోంది. దేశంలో స్వయం సమృద్ధ ఆరోగ్యసంరక్షణ వ్యవస్థను రూపొందించడంలో ఇదో పెద్ద ముంద డుగు. ప్రభుత్వ విధాన ప్రకటన ఈ రంగానికి గొప్ప ఊతం ఇవ్వగలదు.

యావత్ ప్రపంచానికి ఫార్మసీ భారతదేశం. అంతర్జాతీయ జనరిక్స్ మార్కెట్ లో 20% వాటా కలిగి ఉంది. అ మెరికాలో అమ్ముడయ్యే ప్రతీ మూడో మాత్ర కూడా భారతదేశం నుంచి వచ్చిందే. ఏది ఏమైనా పరిశ్రమ మ రెన్నో ఏపీఐలు డ కేఎస్ఎంల కోసం చైనాపై ఆధారపడింది. ఫార్ములేషన్స్ తయారీలో ఇవి కీలకంగా ఉన్నాయి.రానున్న ఐదేళ్లలో రూ.3 వేల కోట్ల మేరకు ఆర్థిక పెట్టుబడులతో 3 బల్క్ డ్రగ్ పార్క్ లలో ఉ మ్మడి మౌలిక వ సతులకు ఆర్థికం సాయం చేయడం ద్వారా బల్క్ డ్రగ్ పార్క్ లను ప్రమోట్ చేసేందుకు ఈ ఆమోదిత స్కీ మ్ తోడ్పడుతుంది. ఇక మరో అంశం, రానున్న ఎనిమిదేళ్ళకు రూ.6,940 కోట్ల ఆర్థిక సాయంతో క్రిటికల్ కేఎస్ఎం, డ్రగ్ ఇంటర్మీడియేట్స్ మరియు ఏపీఐలు దేశీయ తయారీ ప్రమోషన్ కోసం ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్ కు ఇది రూపకల్పన చేస్తుంది.

ఈ సందర్భంగా ఐపీఏ ప్రెసిడెంట్, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ చైర్మన్ శ్రీ సతీశ్ రెడ్డి మాట్లాడుతూ, "అన్ని ఏపీ ఐలను తయారు చేసే శక్తిసామర్థ్యాలను భారతదేశం కలిగిఉంది. ప్రభుత్వం చేసిన ఈ ప్రకటన దేశంలో ఏపీఐ పరిశ్రమ పునరుజ్జీవనానికి తోడ్పడుతుంది. ఔషధ రంగంలో ఒకప్పటి ఆధిక్యాన్ని తిరిగి పొందేందుకు సహకరిస్తుంది. బల్క్ డ్రగ్ పార్క్ ల ఏర్పాటులో పెట్టుబడి అనేది పరిశ్రమ అభివృద్ధి కోసం సరైన దిశలో తీసుకున్న చాలా ముఖ్యమైన చర్య" అని అన్నారు. జైదూస్ కాడిల్లా చైర్మన్ శ్రీ పంకజ్ పటేల్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, "యాంటీ బయాటిక్స్ , విటమిన్లు అనే ఫెర్మెంటేషన్ బేస్డ్ ఏపీఐ లలో చైనా ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. ఫెర్మెంటేషన్ బేస్డ్ పరిశ్రమను ప్రోత్సహించేందుకు ప్రకటించిన ప్రభుత్వ విధానం స్వయం సమృద్ధం కావడంలో తోడ్పడుతుంది" అని అన్నారు. నూతన విధానం గురించి సన్ ఫార్మా మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ దిలీప్ సంఘ్వీ మాట్లాడుతూ, "ఈ నూతన పాలసీ ప్రభుత్వం తీసుకున్న ఓ సాహసోపేత చర్య. భారతదేశంలోని ఏపీఐ పరిశ్రమకు అవసరమైన మద్దతును అందిస్తుంది. ఆరోగ్యసంరక్షణ భద్రతకు మరియ పటిష్ఠమైన భారతీయ ఏపీఐ పరిశ్రమ వాతావరణం నెలకొల్పేందుకు ఇది వీలు కల్పిస్తుంది. ప్రభుత్వానికి నా అభినందనలు" అని అన్నారు.

భారతదేశం మరియు ప్రపంచవ్యాప్తంగా రోగులకు నాణ్యమైన ఔషధాలు అందించేందుకు ఐపీఏ కట్టుబడి ఉంది మరియు రోగి కేంద్రితం మరియు సంక్షేమం మాకెంతో ముఖ్యం. కోవిడ్ -19 మహమ్మారి నుంచి ప్రజలను కాపాడేందుకు అందిస్తున్న నిర్విరామ, నిస్వార్థ సేవలకు గాను ప్రభుత్వ అధికారులకు, యావత్ వైద్య సమాజానికి ఐపీఏ ధన్యవాదాలు తెలియజేస్తుంది. దేశానికి, ప్రపంచానికి సేవలం దిస్తున్నందుకు మేము గర్విస్తున్నాం.

రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలి: మంత్రి ఎర్రబెల్లి

వరంగల్ రూరల్, ఏప్రిల్ 23: జిల్లాలోని రాగన్నగూడెంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, తాలు, తేమ లేకుండా ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు సూచించారు. తెలంగాణల ప్రభుత్వం మాదిరిగా దేశంలోని మరే రాష్ట్రం రైతుల కోసం పాటుపడటం లేదని, సీఎం కేసీఆర్ రాష్ట్రాభివృద్ధి కోసం అను నిత్యం శ్రమిస్తున్నారన్నారు. రైతులకు 24 గంటల విద్యుత్ అందివ్వడంతోపాటు, విత్తనాలు, ఎరువులు, పెట్టుబడులను ప్రభుత్వమే సమకూరుస్తుందని, చివరకు ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తుందని చెప్పారు. అదేవిధంగా కొలనుపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారం భించారు. రైతుల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

పల్లెలు పరస్పరం సహకరించుకోవాలి

కరోనా సాయంలో అందరూ ముందుకు రావాలి: ఎర్రబెల్లి

వరంగల్ రూరల్,ఏప్రిల్23(ఆర్ఎన్ఎ): పల్లెలు పరస్పరం సహకరించుకుని సహకార కేంద్రాలుగా మారాలని గ్రామీణాభివృద్ధి, పంచాయితీరాజ్‌శాఖ మంత్రి ఎర్ర బెల్లి దయాకర్‌రావు అన్నారు. ప్రభుత్వమో లేక దాతలు చేసే సాయం ప్రజలకు సరిపోదన్నారు. అందుకే ప్రజలంతా కలిసికట్టుగా ఉండాలన్నారు. ఒకరికొరు సహకరించుకోవాలని పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర, కొరిపల్లె, వరంగల్ రూరల్ జిల్లా రాయపర్తి, పర్వతగిరి ప్రాంతాల్లో ఎర్రబెల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేదలకు నిత్యావసర వస్తువులను మంత్రి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుకోని విపత్తు కరోనా కష్టాలు తెచ్చిందన్నారు.

దీంతో మొతత్తం ప్రపంచం వణికిపోతోందన్నారు. ఆర్థిక వ్యవస్థ అతలా కుతలం అవుతోందన్నారు. దేశ, రాష్ట్రబ్జడెట్ పరిస్థితి కూడా ఆశాజనకంగా లేదన్నారు. అయినా సీఎం కేసీఆర్ ప్రజలను రక్షించుకోవడానికి అహర్నిశలూ కష్టపడుతున్నారని అన్నారు. ఈ దశలో ప్రజలే ముందుకు రావాలన్నారు. దాతలు ముందుకు వచ్చి తమ ఔదార్యాన్ని చాటుకోవాలన్నారు. గ్రామాల్లోని నిరుపేదలను ఆదుకోవల్సిన అవసరం ఉందన్నారు. కరోనా వైరస్‌ని కలిసి కట్టుగా ఎదుర్కొందామని మంత్రి పిలుపునిచ్చారు. సామాజిక దూరం పాటించడం, స్వీయ నియంత్రణ మాత్రమే కరోనాకు విరుగుడు అని చెప్పారు. ఓపికతో లాక్‌డౌన్‌ను పాటిద్దాం, సీఎం కేసీఆర్ ఇచ్చిన సూచనలను, తూ.చ. తప్పకుండా పాటిద్దామన్నారు.

పండగ చేసుకునే సమయమిది

వాస్తవానికి తెలలంగాణలో భారీగా పంటలు వచ్చాయి. పండగ చేసుకోవాల్సిన సమయంలో కోరానా వైరస్ భయం ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత గతంలో ఎన్నడూ లేనంతగా దిగుబడులు వచ్చాయి. 40 లక్షల ఎకరాల్లో ధాన్య పండింది. 20లక్షల ఎకరాల్లో మక్కలు, ఆపరాలు పండాయి. ఇంత దిగుబడి రావడానికి కారణమైన అన్ని వసతులను ముఖ్యమంత్రి కేసీఆర్‌కల్పించారని ఆయన పేర్కొన్నారు. దురదృష్టవశాత్తూ కరోనా వైరస్ రావడం, దానిని నిర్మూలించడానికి మనం యుద్ధం చేస్తున్నామని అన్నారు. కరోనాను ఎదుర్కొనడమే మన ముందున్న సవాల్ అన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్, రైతు రుణ విముక్తి సంస్థ చైర్మన్ నాగార్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కరోనాపై పోలీసు కళాబృందం అవగాహన కార్యక్రమాలు

కరీంనగర్, ఏప్రిల్ 23(నేటినిజం ప్రతినిది):కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు పోలీసు కళాబృందం, షీటీం పోలీసులు కరోనా వైరస్ వ్యాప్తి నిరోధక చర్యలపై అవగాహన కార్యక్రమాలను అప్రతిహతగా కొనసాగిస్తున్నారు. ఈ బృందాలు నిర్వహిస్తున్న కాటటర్యక్రమాలకు విశేష స్పందన లభిస్తోంది.

ఉదయం 06గంటల నుండి 11గంటల వరకు జనం ఎక్కువగా జమకూడి ఉండే కూరగాయల మార్కెట్లు, మెడికల్‌షాపులు, నిత్యావసరవస్తువులు కొనుగోలు చేసే సూపర్‌మార్కెట్లు, ఇతర వ్యాపార,వాణిజ్య సముదాయాల ప్రాంతాల్లో కరోనా వైరస్ వ్యాప్తి నిరోధకచర్యల్లో భాగంగా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డాక్టర్ల సూచనలు, లాక్‌డౌన్,కర్ఫ్యూల అమలు పటిష్టంగా అమలవుతున్న తీరును వివరిస్తూ రూపొందించిన పాటలు, నాటికలు, నృత్యాలద్వారా వివిధ రకాల వాయిద్యాలను వినియోగిస్తూ ఈ కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. పోలీసు కళాబృందం ఇంఛార్జి రామంచ తిరుపతి ఆధ్వర్యంలో పోలీసులు లాక్‌డౌన్ నేపథ్యంలో వివిధ ప్రాంతాల్లో విస్తరించబడిన మార్కెట్లు, సూపర్‌జజార్‌లతోపాటు ఇతర ప్రాంతాలలో కనీసం రోజుకు 05కు తక్కువకాకుండా ప్రాంతాలలో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. షీబృందాలకు చెందిన సభ్యులు ఏఎస్ఐ విజయమణి ఆధ్వర్యంలో కరోనా వైరస్ వ్యాప్తి నియంత్రణలో భాగంగా పోలీస్‌శాఖ చేపడుతున్న చర్యలు, మహిళలు, విద్యార్థినులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైనట్తైతే నేరుగా పోలీస్‌స్టేషన్‌కు రాకుండా వాట్సాప్, డయల్100, హాక్ఐ యాప్‌ల ద్వారా సమాచారం అందించి పోలీసులసేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

కరోనాపై హర్యానా ముందు జాగ్రత్త

జర్నలిస్టులకు పది లక్షల బీమా ప్రకటించిన సిఎం

చండీగడ్,ఏప్రిల్23(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్‌పై యుద్ధం చేస్తున్న వారిలో జర్నలిస్టులు కూడా ఉన్నారు. కరోనాపై ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. దానికి సంబంధించిన వార్తలను ప్రజలకు చేరవేస్తున్నారు. ఈ క్రమంలో తమిళనాడు, మహారాష్ట్రలో పలువురు జర్నలిస్టులకు కరోనా పాజిటివ్ నిర్ధారణ అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టుల సంక్షేమం కోసం పాటుపడుతున్నాయి. హర్యాన ప్రభుత్వం జర్నలిస్టులకు ప్రమాద బీమా కల్పించింది. ప్రతి జర్నలిస్టుకు రూ. 10 లక్షల చొప్పున బీమా కల్పిస్తున్నట్లు హర్యానా సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్ వెల్లడించారు. సీఎం మనోహర్ లాల్ నిర్ణయం పట్ల హర్యానా జర్నలిస్టులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రెండో ప్రపంచయుద్ధం తరవాత ఇదే అతిపెద్ద సవాల్

-జర్మనీ ఛాన్సలర్ ఏంజెలా మెర్కల్

బెర్లిన్,ఏప్రిల్23(ఆర్ఎన్ఎ): ప్రజల జీవితానికి, ఆరోగ్యానికి.. రెండో ప్రపంచ యుద్ధ తర్వాత ఎదురైన అతిపెద్ద ఛాలెంజ్ ఇదే అని జర్మనీ ఛాన్సలర్ ఏంజెలా మెర్కల్ అన్నారు. కరోనా విసిరిన ఛాలెంజ్ అంతాఇంతా కాదన్నారు. దీనివల్ల ప్రపంచ దేశాలన్నీ గందరగోళంలో పడ్డాయన్నారు. అలాగే కరోనా వైరస్‌ను ఎదుర్కోవడం ప్రజాస్వామ్యానికి పెద్ద సవాల్‌గా మారిందని ఏంజెలా మెర్కల్ అన్నారు. బెర్లిన్‌లోని పార్లమెంట్‌లో ఆమె ప్రజాప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడారు. ఈయూ బ్జడెట్‌కు భారీగా నిధులను ఇవ్వనున్నట్లు ఆమె చెప్పారు. యూరోప్ ఐక్యంగా ఉండేందుకు వైరస్ పెను సవాల్‌గా తయారైందన్నారు. అయితే వీలైనంత క్రమశిక్షణ పాటిస్తే, చాలా త్వరగా సురక్షిత వాతావరణానికి రాగలుగతామన్నారు. సమయాన్నివృధా చేయరాదన్నారు. ఇతరులపై ఆధారపడడం కన్నా.. ప్రత్యేక మెడికల్ కిట్ల గురించి యూరోప్ దేశాలు సిద్ధం కావాలన్నారు. మరోవైపు ఈయూ నేతలు ఆయా దేశాలకు ఉద్దీపన ప్యాకేజీ ఇవ్వాలనుకుంటున్నారు.

వైద్యులకు అండగా కేంద్ర ఆర్డినెన్స్

కేబినేట్ నిర్ణయాన్ని స్వాగతించిన వైద్యులు
ఇకనుంచి ధైర్యంగా విధులు నిర్వహించగలమని వెల్లడి

న్యూఢిల్లీ,ఏప్రిల్22(ఆర్ఎన్ఎ): వైద్య సిబ్బందిపై దాడులకు అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వైద్యులు స్వాగతించారు. కరోనా మహమ్మారిపై పోరులో ముందంజలో ఉండి సేవలు అందిస్తున్న వైద్య సిబ్బందిపై దాడికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకునేలా ఆర్డినెన్స్ తీసుకురానున్నట్టు కేంద్రం బుధవారం ప్రకటించింది. ఈ సందర్భంగా పలువురు వైద్యులు తమ అభిప్రాయాలను మీడియాతో పంచుకున్నారు. ఇటీవల కాలంలో వైద్య సిబ్బందిపై జరిగిన దాడులు సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నాయి. డాక్టర్లకు ప్రత్యేక రక్షణ కల్పిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్ కాస్త ఊరట కలిగించే విషయమని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి డాక్టర్ రవి మాలిక్ అన్నారు. అయితే దాడులకు భయపడబోమని, కరోనా సంక్షోభం నేపథ్యంలో తమ సేవలు కొనసాగిస్తామని ప్రభుత్వానికి విన్నవించారు. ఢిల్లీ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బీబీ వాద్వా కూడా ఇదే రకమైన అభిప్రాయాన్ని వెల్లడించారు.

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: కొవిడ్-19 మహమ్మారిని నియంత్రించడానికి దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం విధించిన లాక్‌డౌన్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్న అన్నదాతల సమస్యలను పరిష్కరించేందుకు 'సైంజింటా' కిసాన్ హెల్ప్ లైన్ ప్రారంభించింది. రైతులు ఈ టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1800-1-215-315 ను ల్యాండ్ లైన్, మొబైల్ ఫోన్లతో 'సైంజింటా' సంప్రదించవచ్చు. ఈ హెల్ప్‌లైన్ నంబర్‌లో సంప్రదించిన రైతులకు పంటల సాగుతోపాటు వ్యవసాయ సంబంధ అంశాలపై సలహాలను పొందవచ్చు. కొవిడ్-19పై పోరులో భాగంగా ప్రజల కదలికలపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించడంతో 'సింజెంటా' ఈ హెల్ప్ లైన్ నంబర్ రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. అత్యవసరంగా ఎదైనా సవాల్ ఎదురైనా మద్దతుగా నిలుస్తామని 'సింజెంటా' తెలుపుతోంది. ఈ హెల్ప్ లైన్ ద్వారా రైతులకు తొమ్మిది వివిధ భాషల్లో సలహాలను ఇచ్చేందుకు 'సింజెంటా' 16 చానెళ్లను ఏర్పాటు చేసింది. రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్ గఢ్, హర్యానా, బీహార్, జమ్ము కశ్మీర్, హిమాచల్ ప్రదేశ